

మెట్రో ఉదయం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 145 వెల: 3/-

దీపావళి వేళ రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్..

న్యూఢిల్లీ, నవంబర్ 5: దీపావళి పండుగ వేళ రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. పన్నుల పంపిణీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలకు నవంబర్ నెలకు సంబంధించిన పన్నుల వాటా కింద రూ.1,09,019 కోట్లను విడుదల చేసింది. వాస్తవానికి ఈ నిధులను నవంబర్ 10న విడుదల చేయాల్సి ఉండగా.. ఐదు రోజుల ముందుగానే అంటే నవంబర్ 5న రాష్ట్రాల ఖాతాల్లో జమ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ

➤ మిగతా 2వ పేజీలో..

శుక్రవారం 06 నవంబర్ 2026 SIMULTANEOUSLY PUBLISHED FROM TELANGANA, ANDRAPRADESH, BENGALURU, MUMBAI, CHENNAI, KERALA, PATNA, KOLKATA & DELHI www.metroudayam.com పేజీలు 12

కాళేశ్వరంపై అసెంబ్లీ!

- ఈ నెలలోనే రెండు రోజుల పాటు సమావేశాలు పెట్టి చర్చిద్దాం
- ప్రతిపక్షం దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- మూడు బ్యారేజీల పరిస్థితి చెబుదాం
- వాటి మరమ్మతు చర్యలను వివరిద్దాం
- మూడేళ్లు ఎందుకు పట్టిందో కూడా చెప్పాలి
- మంత్రులు గోదారి ప్రాజెక్టులు సందర్శించాలి
- నీరు వృథా కావట్లేదని ప్రజలకు వివరించాలి
- మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్
- రూ.4193 కోట్లతో 3 బ్యారేజీల పునరుద్ధరణ
- వచ్చే నెలలో మరమ్మతు పనులు ప్రారంభం
- మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం



హైదరాబాద్, నవంబరు 5 కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల మరమ్మతులపై ఈ నెలాఖరులోగా అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి సమగ్రంగా చర్చిద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో అన్నారు. గోదావరి నీళ్లను కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా ఎత్తిపోయకుండా ఆంధ్రాకు వదిలేస్తున్నారంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగానే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గురువారం క్యాబినెట్ భేటీకి ముందు మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం.. రెండు రోజుల పాటు సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం బ్యారేజీలపై సమీక్షించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు రూ.4193

➤ మిగతా 2వ పేజీలో..



భారత హాకీ జట్టు చరిత్ర..

ఆరోసారి ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ కైవసం

మొహాలీ, నవంబరు 5 హాకీ మైదానంలో భారత ఆటగాళ్ల జోరు మరోసారి ప్రపంచానికి తెలిసింది. ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ ఆరంభంలో భారత్ వెనుకబడినా.. పట్టుదలతో పోరాడి ప్రత్యర్థిని చిత్తు చేసింది. జపాన్‌తో జరిగిన తుది పోరులో 4-1తో విజయం సాధించి ఆరోసారి

➤ మిగతా 2వ పేజీలో..



అమెరికా రాజకీయాల్లో ఒబామా 'వారసుడు'

న్యూఢిల్లీ, నవంబరు 5అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో ఈసారి పలువురు యువ రాజకీయ నాయకులు తమ సత్తా చాటారు. భవిష్యత్తు రాజకీయాల్లో కీలకం కాబోతున్నామని స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఈ జాబితాలో టాప్‌లో నిలిచిన జాన్ ఒసాఫ్‌పై ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు రాజకీయ వారసుడిగా, తదుపరి ఒబామాగా

➤ మిగతా 2వ పేజీలో..

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి: రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్



- అయ్యప్ప సొసైటీ అక్రమ కట్టడాలపై సర్వేకు కవిత డిమాండ్
- కాంగ్రెస్ వచ్చాక 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణ
- సీఎం సోదరులే డబ్బులు దండుకుంటున్నారని వ్యాఖ్య

హైదరాబాద్, నవంబరు 5 హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత

➤ మిగతా 2వ పేజీలో..





'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి? మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

➤2వ పేజీలో..



ప్రవళిక మృతితో అన్ని బస్సులకు డోర్లు తప్పనిసరి చేసిన ఆర్టీసీ

- డోర్లు మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశాలు
- డోర్లు లేని బస్సులకు వెంటనే తలుపులు ఏర్పాటు చేయాలని సూచన
- టికెట్ వివాదంలో ప్రయాణికురాలు నెట్టడంతో ప్రవళికకు తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన మహిళా కండక్టర్

హైదరాబాద్, నవంబరు 5 మహిళా కండక్టర్ ప్రవళిక మృతి తెలంగాణ ఆర్టీసీలో కీలక మార్పుకు దారితీసింది. ప్రయాణికుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు సంస్థ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే అన్ని బస్సులకు తప్పనిసరిగా డోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశించింది. డోర్లు లేని బస్సులను గుర్తించి వెంటనే వాటిని అమర్చాలని అధికారులకు సూచించింది.ఆర్టీసీ పరిధిలోని అన్ని రకాల బస్సులకు ఈ నిబంధన

➤ మిగతా 2వ పేజీలో..

అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డెడ్‌లైన్ మొదలు..

సుప్రీం కోర్టు స్పష్టత



న్యూఢిల్లీ, నవంబరు 5 అదుపులోకి తీసుకున్న వ్యక్తులను న్యాయస్థానాల ముందు హాజరుపరిచేందుకు రాజ్యాంగం విధించిన 24 గంటల గడువుపై సుప్రీం కోర్టు స్పష్టతనిచ్చింది. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే ఈ 24 గంటల డెడ్‌లైన్ ప్రారంభమవుతుందని తేల్చిచెప్పింది. అంతేకానీ ఆ వ్యక్తిని అధికారికంగా అరెస్ట్ చేసిన సమయం నుంచి గడువును లెక్కించకూడదని వివరించింది. 'అధికారికంగా అరెస్ట్ జరిగినప్పటి నుంచే 24 గంటల గడువు మొదలవుతుందని భావించటం తగదు. భారతీయ న్యాయసంహిత ప్రకారం అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డైడ్‌లైన్‌ను లెక్కించాలి. ఇది పూర్తయ్యేలోపు కచ్చితంగా అరెస్ట్ అయిన వ్యక్తిని కోర్టు ముందు హాజరుపరచాలి' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కాగా 24 గంటల గడువు విషయంలో ఒరిస్సా, మద్రాస్, కేరళ హైకోర్టుల గత తీర్పులను సుప్రీం తప్పుబట్టింది. అధికారికంగా అరెస్ట్ జరిగిన క్షణం నుంచే డెడ్‌లైన్ ప్రారంభవుతుందని ఆ హైకోర్టులు మునుపు అభిప్రాయపడ్డాయి. ఈ అభిప్రాయాలను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

కాగా సుజిత్‌దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో భాగంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. మాదకద్రవ్యాల రవాణా కేసులో త్రిపురలో గతేడాది సెప్టెంబర్ 29 మధ్యాహ్న సమయంలో సుజిత్‌దాస్ అనే వ్యక్తి అరెస్ట్ అయ్యాడు. అయితే అక్కడి పోలీసులు సెప్టెంబర్ 30న అతడి అరెస్ట్‌ను అధికారికంగా నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు కోర్టు ముందు సుజిత్‌ను హాజరుపరిచారు. దీన్ని నిందితుడి తరఫు న్యాయవాదులు తప్పుబట్టారు. కావాలనే పోలీసులు అరెస్ట్ సమయాన్ని తప్పుగా చూపిస్తున్నారని వారు వాదించారు. మరోవైపు అరెస్ట్ చేసినప్పుడే 24 గంటల డైడ్‌లైన్ వర్తిస్తుందని దర్యాప్తు సంస్థలు ప్రతి వాదనలు చేశాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు గడువుపై స్పష్టతనిచ్చింది.

మెట్రో ఉదయం
జాతీయ తెలుగు దిన పత్రిక
శుక్రవారం
06.11.2026

కాళేశ్వరంపై అసెంబ్లీ!

కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. డిసెంబరులో మరమ్మతులు ప్రారంభించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అనంతరం జరిగిన క్యాబినెట్ భేటీలోనూ ఈ అంశంపై చర్చించారు. ఎన్డీఎస్ఏ చెప్పినట్లు ప్రాజెక్టుకు అన్ని రిపేర్లు పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని క్యాబినెట్ నిర్ణయించింది.

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సభలో చర్చిద్దామని మంత్రులతో సీఎం అన్నారు. మూడు బ్యారేజీల పరిస్థితి ఏంటి? వాటిలో నీటిని నిల్వ చేస్తే తట్టుకునే పరిస్థితి ఉందా? ఎన్డీఏ?సఏ ఏం నివేదికలు ఇచ్చింది? మరమ్మతులకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోనుంది? అసలు మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇందుకు మూడేళ్ల సమయం ఎందుకు పట్టింది? దేవాదుల, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా గత ప్రభుత్వాల కంటే సమర్థవంతంగా నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నాం? ఈ వివరాలన్నీ సభలో చర్చిద్దామని చెప్పారు. ఈ అంశాలపై బీఆర్ఎస్ నేతలకూ మాట్లాడే అవకాశం ఇద్దామన్నారు. బీఆర్ఎస్ నేతలు, ఆ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారానికి అసెంబ్లీ వేదికగా ప్రజలకు సమాధానం ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు.

మరమ్మతులు చేయకుండా మూడు బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేసే పరిస్థితి లేదని, అవి పని చేయకుండా కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే పరిస్థితి కూడా లేదని సీఎం మంత్రులకు వివరించారు. ఇది తెలిసి కూడా బీఆర్ఎస్ నాయకత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాన్ని రైతులు, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు ఆ రెండు ఎత్తిపోతల ప్రాజెక్టులను సందర్శించాలని ఆదేశించారు. కాళేశ్వరానికి గుండెకాయ లాంటి మూడు బ్యారేజీలు పని చేయకున్నా గోదావరి నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నామో ప్రజలకు చూపించాలని చెప్పారు. సందర్శనకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులనూ తీసుకెళ్లాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క ఈ ప్రాజెక్టులను సందర్శించనున్నారు.

లోపాల సవరణ బాధ్యత నిర్మాణ సంస్థలదే

నిర్మాణపరమైన లోపాలను ఎల్ అండ్ టీ(మేడిగడ్డ), అఫ్కాన్స్(అన్నారం), నవయుగ(సుందిళ్ల) సంస్థలే సరి చేయాల్సి ఉంటుందని, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించాలని సమీక్షలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారం పునరుద్ధరణ పనులు చేపట్టి, దెబ్బతిన్న బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తేవాలని సీఎం నిర్దేశించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

ప్రస్తుత పరిస్థితుల్లో లిఫ్ట్ సాధ్యం కాదు

బ్యారేజీలు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కన్నెపల్లి(ప్రాణ హిత) వద్ద కనిపించే నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటి పారుదల శాఖ ఇంజనీర్లు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూయాల్సి ఉంటుందని అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న ఈ రెండు బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని(ఫ్రీ ఫ్లో) జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్డీఎస్ఏ) సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నీళ్లున్నా లిఫ్ట్ చేయడం లేదన్న తప్పుడు ప్రచారాన్ని ఈ సమాచారంతో తిప్పికొట్టాలని సీఎం మంత్రులకు సూచించారు. మేడిగడ్డ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు నివేదించారు. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల సహకారంతో అవసరమైన పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్రం ఏర్పాటు చేసిన టెక్నికల్ ఓవర్ సైట్ కమిటీ ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వివరించారు.

గతంలో కన్నా మెరుగ్గా పంపింగ్

దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా జే చొక్కారావు దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు సీఎం చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీలు ఎత్తిపోస్తే.. ఈ మూడేళ్లలో సగటున 18.13 టీఎంసీలు పంపింగ్ చేశామన్నారు. గతంతో పోలిస్తే ఇది 89 శాతం అధికమని తెలిపారు. అక్టోబరు నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు.. మొత్తం 24.81 టీఎంసీలు లిఫ్ట్ చేసి వినియోగించుకున్నామని చెప్పారు. ఆ నీటితో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగు, తాగునీరు అందించామన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని సీఎం గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని అన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో పూర్తయ్యేదని, కరెంట్ బిల్లుల భారం గణనీయంగా తగ్గేదని, ఎల్లంపల్లికి నీరు వచ్చేదని వివరించారు.గత ప్రభుత్వ తప్పిదాల వల్లే కుంగుబాటుగత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని సీఎం ఆరోపించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనుల్లో వేగం పెంచాలని సూచించారు. భద్రత విషయంలో రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

నెలాఖరులోగా తుది అనుమతులు

పునరుద్ధరణ పనులకు తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), ఎన్డీఏ?సఏతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్య పునరుద్ధరణ, రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో నీటి పారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రిపేర్లు

ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై క్యాబినెట్ భేటీలో చర్చించారు. ఫౌండేషన్ లోపంతో పాటు కటాఫ్ వాల్స్ లోపం, డౌన్‌స్ట్రీమ్‌లో స్పిల్‌వేకు అవసరమైన వెడల్పు లేకపోవడం, అప్‌స్ట్రీమ్‌లో కటాఫ్ వాల్స్, డయాఫ్రం వాల్ ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలను ఎన్డీఎస్ఏ గుర్తించింది. ఈ లోపాల కారణంగా నీటిని నిల్వ చేయొద్దన్న ఎన్డీఎస్ఏ సిఫారసు మేరకు నిల్వ చేయలేదు. ఎన్డీఎస్ఏ చెప్పినట్లు పూర్తి వివరాలను సమర్పించి, ప్రాజెక్టును ఎలా వినియోగంలోకి తేవాలన్న దానిపై విధివిధానాలు రూపొందించాల్సి ఉంది. ఇప్పటికే పూర్తి వివరాలతో నివేదిక వచ్చింది. దీనిపై చర్చించిన క్యాబినెట్.. పారదర్శకంగా ప్రాజెక్టును రిపేర్ చేసి, ఉపయోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది.

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి: రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్

ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

‘ఆర్ఆర్ ట్యాక్స్’ నిజమే అయితే చర్యలేవి? మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

- ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు
- చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బిల్డర్లు, డెవలపర్లకు విషయం తెలుసన్న కేటీఆర్
- విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న
- బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

హైదరాబాద్, నవంబరు 5 తెలంగాణ రాజకీయాల్లో ‘ఆర్ఆర్ ట్యాక్స్’ వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా ‘ఆర్ఆర్ ట్యాక్స్’ వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి ‘ఆర్ఆర్ ట్యాక్స్’ పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు.ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.‘ఆర్ఆర్ ట్యాక్స్’ అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.

ప్రవళిక మృతితో అన్ని బస్సులకు డోర్లు తప్పనిసరి చేసిన ఆర్టీసీ

వర్తించనుంది. ఇప్పటివరకు డోర్లు లేకుండా నడుస్తున్న బస్సులను గుర్తించి తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని సంస్థ ఆదేశించింది. ఇకపై బస్సు బయలుదేరే ముందు డోర్లు మూసి ఉన్నాయో లేదో సిబ్బంది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ప్రవళిక మృతి నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉండగా టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను బస్సు నుంచి బయటకు నెట్టివేయడంతో ప్రవళిక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.ప్రవళిక కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం, ఆర్టీసీ సంయుక్తంగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ ప్రత్యేక పాలసీ ద్వారా మరో రూ.కోటి ప్రమాద బీమా కూడా కుటుంబానికి అందనుంది.

దీపావళి వేళ రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్..

వెల్లడించింది.పన్నుల వాటా నిధుల్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ.19,208 కోట్లు కేటాయించారు. బిహార్‌కు రూ.10,845 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.8,010 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.7,866 కోట్లు, మహారాష్ట్రకు రూ.7,022 కోట్లు, రాజస్థాన్‌కు రూ.6,460 కోట్లు కేటాయించారు. అత్యల్పంగా సిక్కింకు రూ.365 కోట్లు విడుదల చేసింది కేంద్ర ప్రభుత్వం.అక్టోబర్ 31న కూడా కేంద్ర ప్రభుత్వం.. అదనపు పన్నుల వాటా కింద మరో రూ.1,09,019 కోట్లను విడుదల చేసింది. దీంతో కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే రాష్ట్రాలకు మొత్తం రూ.2,18,038 కోట్ల నిధులు అందాయి. ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఇది రెండో అదనపు పన్నుల వాటా విడుదల.కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు 41 శాతం వాటా లభిస్తుంది. ఆ మొత్తాన్ని ఆర్థిక సంవత్సరంలో 14 విడతలుగా రాష్ట్రాలకు కేంద్రం పంపిణీ చేస్తుంది. ముందస్తుగా నిధులు విడుదల చేయడం ద్వారా రాష్ట్రాలు మూలధన వ్యయాలను పెంచడంతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు వినియోగించుకునే అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. ఇకపోతే 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పన్నుల వాటా కింద రూ.15.26 లక్షల కోట్లను కేటాయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో ఈ మొత్తం రూ.13.93 లక్షల కోట్లుగా ఉంది.

భారత హాకీ జట్టు చరిత్ర..

ఆరోసారి ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ కైవసం

ఆసియా ఛాంపియన్స్‌గా మారి ట్రోఫీని ముద్దాడింది. దీంతో ఈ టోర్నీలో అత్యధిక టైటిళ్లు సాధించిన జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది.

వెనుకబడినా.. వెనకడుగు వేయలేదు!

మొహాలీలోని ఒలింపియన్ బల్బీర్ సింగ్ సీనియర్ అంతర్జాతీయ హాకీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో భారత్‌కు జపాన్ గట్టి పోటీ ఇచ్చింది. తొలి గోల్ సాధించి భారత జట్టును ఒత్తిడిలోకి నెట్టింది. అయితే ఆ తర్వాత భారత ఆటగాళ్లు సమష్టిగా పోరాడుతూ ప్రత్యర్థి ఆధిక్యాన్ని తుడిచిపెట్టారు. షిలానంద్ లక్రా నేతృత్వంలో జట్టు పుంజుకోగా.. చివరి క్వార్టర్‌లో భారత ఆటగాళ్లు దూకుడు పెంచారు. వరుస గోల్స్‌తో జపాన్‌ను వెనక్కి నెట్టి 4-1తో విజయం సాధించారు.

ఆసియా హాకీలో భారత్‌దే ఆధిపత్యం

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో భారత జట్టు విజయాల పరంపర ప్రత్యేకమైనది. 2011లో తొలిసారి టైటిల్ సాధించిన భారత్.. 2016లో రెండోసారి విజేతగా నిలిచింది. 2018లో పాకిస్థాన్‌తో కలిసి సంయుక్త విజేతగా నిలిచింది. 2023లో మలేషియాపై విజయం సాధించి నాలుగో టైటిల్‌ను అందుకుంది. 2024లో చైనాను ఓడించి ఐదోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఇప్పుడు జపాన్‌పై గెలుపుతో ఆరో టైటిల్‌ను సాధించి తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.

అజేయంగా సాగిన ప్రస్థానం

ఈ టోర్నీలో భారత జట్టు ఆరంభం నుంచే అద్భుత ప్రదర్శన చేసింది. లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి అజేయంగా నిలిచింది. సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 8-1తో భారీ విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. అక్కడ జపాన్‌ను ఓడించి మరోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. వరుస విజయాలతో సాగిన భారత ప్రస్థానం.. ఆరో టైటిల్‌తో ఘనంగా ముగిసింది.

అమెరికా రాజకీయాల్లో ఒబామా ‘వారసుడు’

పరిశీలకులు ఆయనను అభివర్ణిస్తున్నారు.

ఎవరీ జాన్ ఒసాఫ్..

రాజకీయాల్లోకి రాకమునుపు ఒసాఫ్ ఓ డాక్యుమెంటరీ ప్రొడక్షన్ సంస్థను నిర్వహించారు. తన డాక్యుమెంటరీల్లో అవినీతిని ఎండగట్టారు. ప్రముఖ పౌర హక్కుల కార్యకర్త జాన్ ల్యూయిస్‌కు సహాయకుడిగా కూడా పని చేశారు. 2021లో తొలిసారిగా ఆయన జార్జియా రాష్ట్రంలో రిపబ్లికన్లకు షాకిచ్చారు. ఆ ఎన్నికల్లో రిపబ్లికన్ సెనేటర్‌ను ఓడించి విజేతగా నిలిచారు.తాజా ఎన్నికల్లో ప్రచారం కోసం ఏకంగా 100 మిలియన్ నిధులను సమీకరించారు. 2024లో జార్జియా ఓటర్లు ట్రంప్‌నకు బ్రహ్మరథం పట్టారు. అలాంటి రాష్ట్రంలో ఈసారి జరిగిన మిడ్‌టర్మ్ ఎన్నికల్లో మరోసారి రిపబ్లికన్ అభ్యర్థి మైక్ కాలిన్స్‌ను ఓడించి సెనేటర్‌గా మరోసారి ఎన్నికయ్యారు. ఒసాఫ్ అట్లాంటాలోఉంటున్నారు. ఆయన భార్య పేరు డా. అలీషా క్రామర్. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.ఇక సెనేటర్‌గా తొలి పర్యాయంలోనే ఆయన తన సత్తా చాటారు. ప్రైవేటైజ్డ్ హౌసింగ్‌లో మిలిటరీ ఉద్యోగుల కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు, దత్తత వెళ్లిన పిల్లల అవస్థలు, జైళ్లల్లో అవినీతిని ఎండగట్టేందుకు దర్యాప్తులకు నేతృత్వం వహించారు. జాతీయ భద్రతకు సంబంధించి అమెరికా ఉన్నతాధికారుల చాట్‌గ్రూప్‌లో ఓ జర్నలిస్టు చొరబడటంపై కూడా ఆయన దర్యాప్తు చేశారు. విచారణ సందర్భంగా ఏకంగా సీఐఏ డైరెక్టర్‌ను సూటి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ ఉదంతం దేశానికే తలవంపులు అంటూ ఉన్నతాధికారులను కడిగిపారేశారు.

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పులను ఎండగట్టడంలో ముందుండే ఒసాఫ్ తన వాక్పటిమ, అభ్యుదయ వాద భావాల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను గుర్తుకు తెస్తారని పరిశీలకులు కామెంట్ చేస్తున్నారు. అమెరికాలో తదుపరి ఒబామా ఒసాఫ్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

కొడంగల్‌లో రేపటి నుంచి సీఎం పర్యటన

3 రోజులపాటు పలు కార్యక్రమాలకు హాజరు

హైదరాబాద్/కొడంగల్, నవంబరు 5 ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. శనివారం నుంచి మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రూ.9,053 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు పలు భవనాలను ఆయన ప్రారంభించనున్నారు. శనివారం (7వ తేదీ) ఉదయం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలను సీఎం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమవుతారు. అక్కడి నుంచి కొడంగల్ చేరుకుని, రాత్రి అక్కడే బస చేస్తారు. ఆదివారం(8వ తేదీ) ఉదయం మళ్లీ హకీంపేట చేరుకుని స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. సీఎం జన్మదినం సందర్భంగా కొడంగల్‌లోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి వేడుకల్లో పాల్గొంటారు. సీఎం పర్యటన సందర్భంగా మొత్తం రూ.9,053 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2, ఎస్‌డీఎఫ్ కింద రూ.1,410 కోట్లతో 223 బీటీ రోడ్లు, రూ.2,100 కోట్లతో మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ఫేజ్-2 పనులు, రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూర్‌లో ఆధునిక బస్టాండ్‌లు, తిమ్మారెడ్డిపల్లిలో రూ.4.45 కోట్లతో గురులోక్ మసీద్ ప్రణాళిక మందిరం అభివృద్ధి, రూ.5.10 కోట్లతో కొడంగల్ నిరంజన మఠం అభివృద్ధి, రూ.20 కోట్లతో మద్దూర్‌లో ఎన్ఏసీ స్కిల్ డెవల్‌పమెంట్ సెంటర్, రూ.59.30 కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణం, రూ.10కోట్లతో హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో టూరిజం హోటల్, రూ.20కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్, రూ.123 కోట్లతో కొడంగల్ వ్యవసాయ కళాశాల భవనం, రూ.81కోట్లతో ఎకో పామ్ ఆయిల్ కంపెనీ నిర్మాణం తదితర పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు.

పల్లె దవఖానకు జాతీయ స్థాయి గుర్తింపు



రాయికల్, నవంబర్ 5 (మెట్రో ఉదయం):
రాయికల్ మండలం అల్లీపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మంది ర్ (పల్లె దవాఖాన) కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఆగస్టు 13న వర్చువల్ విధానంలో ఆరోగ్యం మందిర్ వసతులు, సేవలు తదితర అంశాలను రికార్డులను పరిశీలించి 91.89 మార్కులు కేటాయించి జాతీయ నాణ్యత స్థాయి ప్రమాణాల గుర్తింపును అందజేశారు.. ఈ గుర్తింపు ద్వారా ఆరోగ్య మందిర్ కు ఏటా అభివృద్ధికి మూడేళ్లపాటు నిధులు విడుదలకు కానున్నాయి... ఈ సందర్భంగా కృషి చేసిన సిబ్బందిని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ అభినందించారు

టిజిఐఆర్‌డిలో రెండు రోజుల అవగాహన కార్యక్రమం



రాయికల్, నవంబర్ 5 (మెట్రో ఉదయం):
హైదరాబాదు లోని రాజేంద్రనగర్ లో టి జి ఐ ఆర్ డి లో రెండు రోజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ బోదనపు నటరాజ్ కోరుట్ల రశ్మీధర్ తేజ డి ఈఎల్ ఈ డి కళాశాల నుండి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్ సి ఆర్ టి తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ నాంపల్లి రాజేష్ , ఇక్కడ నేర్చుకున్న అంశాలను విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యాలు పెంపొందించుటలో ప్రధాన పాత్ర వహించాలని సూచించారు. అదిలాబాద్ డైట్ ప్రిన్సిపాల్ ఎండి అబ్దుల్ పరిశోధన గురించి వివరించారు. అలాగే నిజామాబాద్ డైట్ ప్రిన్సిపాల్ టి శ్రీనివాస్ ప్రత్యక్ష బోధన ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికి తీసి సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కరీంనగర్ డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య చాత్రో ఉపాధ్యాయులకు ఉపాధ్యాయులకు ఉండవలసిన లక్షణాలను, మరియు కాలాంశ పథకాలు మరియు సిసిఈ రికార్డుల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నటరాజ్ చెప్పిన విషయాలను కూలంకషంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్ మరియు ఎస్ సి ఆర్ టి సిబ్బంది అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకునికి సర్టిఫికెట్ ను అందజేశారు.

అంగన్వాడిలో అక్షరాభ్యాస కార్యక్రమం



రాయికల్, నవంబర్ 5 (మెట్రో ఉదయం):
చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించి, బాల్యదశ నుంచే విద్యాభ్యాసానికి పునాది వేయాలనే ఉద్దేశంతో చెర్లకొండాపూర్ అంగన్వాడీ సెంటర్‌లో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాలు దిద్దించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రాథమిక విద్యకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని, తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చిన్నారులకు మంచి విద్యా అలవాట్లు పెంపొందించడంలో తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దువ్వాక రవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. నవ్యశ్రీ, అంగన్వాడీ టీచర్ సఫియా, ఆయమ్మ ఆర్మూరి నర్సు మరియు గర్భిణీలు, బాలింతలు, తల్లులు చిన్నారులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా ప్రమాద బాధిత చిన్నారులకు వాసన్ ఐ కేర్‌లో ఉచిత వైద్యం



అంబర్ పేట్, నవంబర్ 5 (మెట్రో ఉదయం):
దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు ప్రమాదవశాత్తు కంటి గాయాలకు గురైన 15 ఏళ్లలోపు చిన్నారులకు నవంబర్ 4 నుంచి 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు వాసన్ ఐ కేర్ ఆసుపత్రి యాజమాన్యం ప్రకటించింది. హైదరాబాద్ కేపీహెచ్‌బీ వాసన్ ఐ కేర్ శాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో వైద్యులు డా. రవి కుమార్, డా. శ్రీవిన్య, డా. మనోజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. దీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు చిన్నారుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు తగిన దూరం పాటించడంతో పాటు రక్షణ కళ్లద్దాలు ధరించాలని తెలిపారు. ప్రమాదవశాత్తు కంటికి గాయమైతే కంటిని రుద్దడం, నొక్కడం లేదా సొంత వైద్యం చేసుకోవడం చేయకూడదని, వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. చిన్నారుల కంటి చూపును పరిరక్షించడమే లక్ష్యంగా ఈ ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు డా. రవి కుమార్, డా. శ్రీవిన్య, డా. మనోజ్ తెలిపారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణ రావు



భూపాల్ పల్లి ఉదయం ప్రతినిధి
భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి రూరల్ మండల పరిధిలోని నాగారం, దీక్షకుంట, ఆజంనగర్, పంబాపూర్, కమలాపూర్, నందిగామ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను భూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గంద్ర సత్యనారాయణ రావు గారు ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రైతులు ఐకేపీ, పీఏసీఎస్ తదితర కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలకు, అనవసరపు కోతలకు తావులేకుండా రైతులకు న్యాయం చేయాలని మిల్లర్లు, సంబంధిత అధికారులను సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులకు, గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఓ, డీఎస్ఓ, వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచులు, మండల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పటాకులు విక్రయించే దుకాణదారులు తప్పని సరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

- ఆమనగల్ మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి



మెట్రో ఉదయం ఆమనగల్ ప్రతినిధి రమేష్
నవంబర్ 5:
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం అమంగల్ మున్సిపాలిటీ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా స్టాళ్లు లేదా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా మున్సిపాలిటీ నుండి తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ పొందవలసి ఉంటుంది. అలాగే,వ్యాపార నిర్వహణలో అవసరమైన అన్ని భద్రతా మరియు రక్షణ నిబంధనలను తప్పక పాటించాలి అని మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు లేనిచో కఠిన చర్యలు తీసుకోబడునని దుకాణదారులకు హెచ్చరించారు..

ఘనంగా స్వర్గీయ కేఎం పాండు 8వ వర్ధంతి.. ఘన నివాళులు!

- ప్రజాసేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.. భావితరాలకు ఆదర్శం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 05, ఉదయం:
కుత్బుల్లాపూర్ మాజీ సర్పంచ్, తొలి మున్సిపల్ మాజీ చైర్మన్, ప్రజానాయకులు స్వర్గీయ కేఎం పాండు 8వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం కుత్బుల్లాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేఎం పాండు సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజాసేవకు అంకితమైన కేఎం పాండు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన విశేష కృషి ఎప్పటికీ మరువలేనిదని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రాంత అభివృద్ధికి ఆయన అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల హృదయాల్లో ఆయనకు ఉన్న స్థానం ఎప్పటికీ చెక్కుచెదరదని పేర్కొంటూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పొలేస్తేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



జగిత్యాల, నవంబర్ 5, ఉదయం జిల్లా ప్రతినిధి:
జగిత్యాల మండలం పొలాస గ్రామ ప్రముఖ ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీ పొలేస్తేశ్వర స్వామి ఆలయంలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు ఆలయ అర్చకులు,ఈవో ఆశీర్వచనాలు మరియు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొలాస సర్పంచ్ శంకర్ ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి ఆలయ చైర్మన్ భూమన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, ఏఎంసి డైరెక్టర్ జైరాం సురేష్ సత్యనారాయణ గౌడ్ తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.. ప్రెస్ క్లబ్-2 డిమాండ్!



చిట్యాల 05 మెట్రో ఉదయం న్యూస్
జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్ పాక గ్రామానికి చెందిన జర్నలిస్టు గొర్రె అనిల్‌పై జరిగిన దాడిని ప్రెస్ క్లబ్-2 సభ్యులు తీవ్రంగా ఖండించారు. బాధిత జర్నలిస్టును పరామర్శించిన అనంతరం మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.



కళాకారుడు విక్రమ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



జగిత్యాల, నవంబర్ 5, ఉదయం జిల్లా ప్రతినిధి:
జగిత్యాల జిల్లా కొండగట్టుకు చెందిన ప్రముఖ కళాకారుడు (మెజీషియన్) సోయం విక్రం చిన్నమ్మ సోయం నందమ్మ ఇటీవల మరణించగా గురువారం ద్వాదశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి కళాకారుడు జర్నలిస్ట్ మల్యాల సతీష్ కుమార్, మిత్రుడు మార్గం ఆదిత్య, హాజరై నందమ్మకు నివాళులు అర్పించి నందమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే విక్రం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నిహితులు, బంధువులు కిషన్, జనార్ధన్, ధనుంజయ్, వేణు, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

"గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ" ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొన్న బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

- బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బట్టా విజయ గాంధీ నేతృత్వంలో
- 6 లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి అంటూ సూచనలు



బూర్గంపాడు నవంబర్ 5 ఉదయం న్యూస్
వరంగల్ -ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలోనే జరగనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు జాబితాలో (Online_Offline) లో "FORM-18 ద్వారా" తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,మన ఓటుహక్కును' మనం వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో మన పేరు నమోదై ఉండేలా చూసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని మొదటి ప్రాధాన్యత ఓట్లతో భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిస్తూ.... బూర్గంపహాడ్ మండలంవేపలగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని పోలవరం గ్రామంలో పలువురి సమన్వయంతో పట్టభద్రులైన పలువురు విద్యార్థులను, ఓటు నమోదుప్రక్రియలో భాగస్వామ్యంచేస్తున్న బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ యంత్రాంగం ఈ కార్యక్రమంలో స్థానిక వేపల గడ్డ సర్పంచి బొల్లి నిరోష,బిఎల్ఎ కుంజా ప్రవీణ్ కుమార్, వర్క రమేష్ తదితరులు పాల్గొన్నారు అలాగే పినపాక పట్టి నగర్ లో స్థానిక సర్పంచ్ బానోత్ పద్మ,గ్రామ నాయకులు రెంటాలజగదీష్ బాబు, తలారి ప్రసాద్,గుండమల్ల సికిందర్ కొప్పుల ప్రసాద్ తదితరులు పాల్గొని పినపాకపట్టి నగర్ లో పట్టభద్రులైన ఓటర్లను ఇంటింటికి తిరిగి ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కోరారు...

24 గంటల్లో చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్ట్

- **పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు**
- **సీఐ రాజ్ కుమార్, ఎస్ఐ నరేష్, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లకు బహుమతులు**



జగిత్యాల, నవంబర్ 5, ఉదయం జిల్లా ప్రతినిధి:
జగిత్యాల జిల్లా కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైన ముగ్గురు నిందితులను సంఘటన జరిగిన కేవలం 24 గంటల్లోనే గుర్తించి అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మల్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, కొడిమ్యాల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఐడీ పార్టీ కానిస్టేబులు రాజేందర్, అంజనేయులు, విక్రాంత్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారి విధి నిర్వహణను ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరం జరిగిన వెంటనే స్పందించి, ఎలాంటి ఆలస్యం లేకుండా దర్యాప్తు ప్రారంభించడం, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కోవడం, క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ చేయడం, పోలీసు బృందాల మధ్య సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించడం సాధ్యమైందని తెలిపారు. మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైన ముగ్గురు నిందితులను వేగంగా గుర్తించి అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసు శాఖలో విధి నిర్వహణలో వేగం, సమయస్ఫూర్తి, అంకితభావం, సమన్వయం ఎంతో ముఖ్యమని ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు, చైన్ స్నాచింగ్ వంటి ఆస్తి సంబంధిత నేరాల విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నేరం జరిగిన వెంటనే స్పందించి నిందితులను త్వరితగతిన పట్టుకోవడం ద్వారా బాధితుల్లో పోలీసులపై నమ్మకం మరింత పెరుగుతుందని, నేరస్థుల్లో చట్టంపై భయం ఏర్పడుతుందని తెలిపారు. ఇలాంటి ప్రతిభావంతమైన విధి నిర్వహణను గుర్తించి పోలీసు సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా ఇతర సిబ్బందిలోనూ మరింత ఉత్సాహం, బాధ్యత, అంకితభావం పెరుగుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన పనితీరును కొనసాగిస్తూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల భారంతో ప్రజలపై పెనుభారం

- **800 నుంచి 1000 శాతం పెంపుపై అఖిలపక్ష కౌన్సిలర్ల నిరసన**
- **పన్నులు తగ్గించేందుకు కమిషనర్ నిరాకరణ.. సమావేశం నుంచి వాకౌట్**



ములుగు, ఉదయం ప్రతినిధి నవంబరు 5:
నూతన ములుగు మున్సిపాలిటీలో పెంచిన పన్నులపై కౌన్సిల్ సమావేశం అట్టుడికింది. ఇళ్లు, దుకాణాలపై 800 నుంచి 1000 శాతం వరకు పన్నులు పెంచడాన్ని నిరసిస్తూ అఖిలపక్ష కౌన్సిలర్లు సమావేశంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పన్నులు తగ్గించాలని కోరినా కమిషనర్ సానుకూలంగా స్పందించకపోవడంతో సమావేశం నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. మెజార్టీ కౌన్సిలర్లు పన్నుల పెంపును వ్యతిరేకించడం చర్చనీయాంశంగా మారింది.

సామాన్యులపై పన్నుల పిడుగు

మూడో కేటగిరీ మున్సిపాలిటీ అయిన ములుగులో గతంలో వందల రూపాయలుగా ఉన్న ఇంటి, దుకాణాల పన్నులు ప్రస్తుతం వేల రూపాయలకు చేరాయని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 800 నుంచి 1000 శాతం వరకు పన్నులు పెంచడం సామాన్య ప్రజలకు తీవ్ర భారంగా మారిందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో పెంకుటిళ్లపై సైతం వేల రూపాయల పన్నులు విధించడం దారుణమన్నారు. పన్నులు చెల్లించలేక ఇళ్లు అమ్ముకునే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యాపారుల మనుగడ ప్రశ్నార్థకం

పట్టణంలో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వర్తకులపై పన్నుల భారం తీవ్ర ప్రభావం చూపు తోందన్నారు. వ్యాపారాలు మందగించి ఆదాయం తగ్గిన సమయంలో పన్నులు భారీగా పెంచడం వల్ల దుకాణాలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగం మందగించడం, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వరి సాగు సరిగా లేకపోవడం వంటి పరిణామాలు ప్రజల ఆర్థిక పరిస్థితిని మరింత దిగజార్చాయని తెలిపారు.

చట్ట నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ ఆరోపణ

నూతన మున్సిపాలిటీ ఏర్పాటైన అనంతరం మూడేళ్ల వరకు పన్నులు పెంచకూడదనే నిబంధనలు ఉన్నాయని కౌన్సిలర్లు గుర్తుచేశారు. అయినప్పటికీ వాటిని పట్టించుకోకుండా పన్నుల పెంపునకు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకుండా ప్రజలపై పన్నుల భారం మోపడం అభివృద్ధికి సరైన విధానం కాదని విమర్శించారు.

భువన సర్వేపై పట్టణ సభ నిర్వహించాలని డిమాండ్

భువన సర్వేపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు పట్టణ సభ నిర్వహించాలని అఖిలపక్ష కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ప్రజలకు ఎదురవుతున్న సందేహాలు, అభ్యంతరాలను బహిరంగంగా చర్చించి పరిష్కరించాలని కోరారు. అయితే, ఎవరైనా ప్రశ్నిస్తే తన వద్దకు పంపించాలని కమిషనర్ సూచించడం పట్ల కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. గంటల తరబడి చర్చించినప్పటికీ పన్నులు తగ్గించే ప్రసక్తే లేదని కమిషనర్ స్పష్టం చేయడంతో ఆగ్రహించిన కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. ఈ నిరసనలో అఖిలపక్ష కౌన్సిలర్లు కోయిల లక్ష్మి, బైకాని సునీత, ఓదెలు, రేసోజు పద్మ, వేణుగోపాల చారి, బైకాని అనూష, సాగర్, గంద్రకోట వాణి, కుమార్లు పాల్గొన్నారు.

కార్మిక వాడల సృష్టికర్త కీర్తిశేషులు కేం. పాండు

- **చింతల్‌లో ఘనంగా వర్ధంతి కార్యక్రమం.. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గూడ ఐలయ్య గౌడ్, కార్మిక, దళిత నాయకులు**



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 05, ఉదయం:
కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ కార్మిక నాయకులు కీర్తిశేషులు కేం. పాండు వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం చింతల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు, ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, దళిత నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఒకప్పుడు అరణ్య ప్రాంతంగా ఉన్న కుత్బుల్లాపూర్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంలో కేం. పాండు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో హెచ్ఎంటీ పరిశ్రమ స్థాపనతో పాటు జీడిమెట్ల, షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన నిరుపేద కార్మికులకు నివాసం కల్పించాలనే గొప్ప సంకల్పంతో ఇళ్ల స్థలాలు అందించి కార్మిక వాడల ఏర్పాటుకు కేం. పాండు విశేష కృషి చేశారని తెలిపారు. పేదల పక్షాన నిలబడి వారి అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన ఆయన సేవలు, చరిత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. నాటి తరం నాయకులకు, నేటి తరం నాయకులకు కేం. పాండు జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన కుమారుడు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రజలకు సేవలందిస్తూ ప్రజా నాయకుడిగా తన తండ్రి ఆశయాలను కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. కేం. పాండు చేసిన నిస్వార్థ రాజకీయ, సామాజిక సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు హెచ్ఎంటీ కృష్ణ గౌడ్, రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షులు డాక్టర్ ఏవీ జేమ్స్ శంకర్, పలువురు కార్మిక, దళిత నాయకులు పాల్గొని కేం. పాండుకు ఘనంగా నివాళులర్పించారు.

ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా గూడూరు శ్రీనివాస్ రెడ్డి



మెట్రో ఉదయం ఆమనగల్ ప్రతినిధి రమేష్ నవంబర్ 5:
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్ కడ్తాల్ కు చెందిన వ్యక్తి సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మరియు డిసిసి అధికార ప్రతినిధి గూడూర్ శ్రీనివాస్ రెడ్డి నీ రాష్ట్ర ప్రభుత్వం నియమించినది, వారితో పాటు ప్రాథమిక సహకార సంఘం సభ్యులుగా కాలే మల్లయ్య, పత్లావత్ ఆనంద్ కుమార్, గౌని యాదమ్మ, వగ్గూ వెంకటమ్మ, మిట్ట నారాయణ, తల్లోజు పెంటమ్మ కే భగవాన్ రెడ్డి నక్క పోతు నరసింహ డి బాల్రెడ్డి నినావాత్ సీతారాం నేనావత్ రాజు కేతావత్ కిషోర్ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినారు, ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన ఎంపీ మల్లు రవికి మరియు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి మరియు మాజీ ఎమ్మెల్యే వంశీ చందు రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు నాకు ఈ అవకాశానికి సహకరించిన ప్రతి ఒక్క కాంగ్రెస్ పెద్దలకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు..




29లోగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

- **లేకపోతే రాహుల్ గాంధీ నివాసం ముట్టడిస్తా జస్టిస్ చంద్రకుమార్**



ఖమ్మం ప్రతినిధి ఉదయం
ఖమ్మం 5: వెలుగుమట్ల భూదాన భూమి బాధితులైన అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన టిటిడిసిలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. భూదాన భూమిలో 15 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేసిందని పేర్కొన్నారు. బాధితుల పోరాట ఫలితంగా 311 మందికి అదే ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. అయితే మిగిలిన బాధితుల్లో అర్హులైన వారికి కూడా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ గత కలెక్టర్, రెవెన్యూ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని చెప్పారు. అర్హుల జాబితాను మంత్రికి అందించినప్పటికీ ఇప్పటివరకు స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 29వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని, అప్పటిలోగా అర్హులందరికీ ఇళ్లపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే తాను ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. అన్ని సంఘాలను కలుపుకొని రాహుల్ గాంధీ నివాసాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు మాట్లాడుతూ.. వెలుగుమట్ల భూదాన భూమిలో మిగిలిన 20 ఎకరాలను అర్హులైన బాధితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు మిగిలిన బాధితులకు ఇళ్లు మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఖమ్మం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వరకు పాదయాత్ర చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది వంజాకుల లక్ష్మీనరసయ్య, బహుజన నాయకులు లిక్కి కృష్ణారావు, వెలుగుమట్ల భూదాన భూమి బాధితులు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో నారాయణ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఖమ్మం ప్రతినిధి. ఉదయం
ఖమ్మం నగరంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో తమ ప్రతిభను చాటుకున్నారు . నవంబర్ 1, 2026న ఖమ్మంలోని వర్తక సంఘ భవనంలో" సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే-డో అకాడమీ ఇండియా "ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ - 2026 పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించినవారు అక్షర గోకుల, జైత్ర యాదవ్, రుషిత విశాంత్, దేవాన్స్, కార్తీక్ నందన్ సిల్వర్ మెడల్స్ సాధించినవారు కార్తికేయ, భరత్ చంద్ర, సత్య సందేశ్, కీయాన్స్ , సోనాక్షిక ప్రియ, భవిష్, సాక్షిత బ్రాంజ్ మెడల్స్ సాధించిన వారు పూజ, దివిజ ఉన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా నారాయణ విద్యాసంస్థలు ప్రోత్సహిస్తున్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను మరియు కరాటే కోచ్ ఉపేందర్ ను ప్రిన్సిపాల్ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బిజెపి చీఫ్ చేతుల మీదుగా అబ్బూరి రచించిన పుస్తకం ఆవిష్కరణ



నాచారం, నవంబర్ 05 (మెట్రో ఉదయం):
పరిపాలన విభాగంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు 'ఏ కాంప్రహెన్సివ్ బుక్ ఆన్ ఆఫీస్ కరస్పాండెన్స్' పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. తార్నాకలోని తన నివాసంలో అబ్బూరి వెంకట రమణ రచించిన ఈ పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేయడంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ పుస్తకం ద్వారా అనువాద ప్రక్రియ సులభతరం అవుతుందని పేర్కొన్నారు.గతంలో అబ్బూరి వెంకటరమణ న్యాయవాదులకు ఉపయోగపడే పుస్తకాన్ని రచించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు ప్రయోజనం చేకూర్చేలా ఆఫీస్ కరస్పాండెన్స్‌పై సమగ్ర పుస్తకాన్ని రచించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏ వి ఆర్ కె కాంత్, రాధాకృష్ణ, రామ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫాక్స్ సాగర్ సుందరీకరణ పనులతో ఉమామహేశ్వర కాలనీకి ఎలాంటి ఇబ్బంది లేదు

- కాలనీ వాసులు ఆందోళన చెందవద్దు.. అండగా ఉంటాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 05, ఉదయం:
సీఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫాక్స్ సాగర్ సుందరీకరణ పనుల్లో భాగంగా హైడ్రా చేపడుతున్న చర్యల నేపథ్యంలో ఉమామహేశ్వర కాలనీ పరిస్థితిపై వస్తున్న ప్రచారాలు, పుకార్లతో తాము ఆందోళన చెందుతున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పందిస్తూ.. ఫాక్స్ సాగర్ సుందరీకరణ పనుల వల్ల ఉమామహేశ్వర కాలనీకి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అనవసరమైన పుకార్లను నమ్మి కాలనీ వాసులు భయాందోళనలకు గురికావద్దని సూచించారు. కాలనీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు రియాజుద్దీన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కె.ఎం. పాండు సేవలు చిరస్మరణీయం

- కుత్బుల్లాపూర్ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిది



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 05, ఉదయం:
మాజీ సర్పంచ్, తొలి మున్సిపల్ చైర్మన్, కీర్తిశేషులు కె.ఎం. పాండు 8వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుత్బుల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన విశేష సేవలను, ప్రజలకు అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, సాయిబాబా నగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లివారాల వినోద్ కుమార్‌లి పాల్గొని కె.ఎం. పాండు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ ముదిరాజ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కీర్తిశేషులు కె.ఎం. పాండు సేవలను స్మరించుకున్నారు.

ప్రేరణ కార్యక్రమంలో బండారుపల్లి విద్యార్థిని ప్రతిభ

- హర్షితను అభినందించిన జిల్లా కలెక్టర్



ములుగు, ఉదయం ప్రతినిధి నవంబరు 5:
గుజరాత్ రాష్ట్రంలోని వడ్నగర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ప్రేరణ కార్యక్రమం – 2026లో ప్రతిభ కనబరిచిన బండారుపల్లి పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని హర్షితను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయురాలు రామాదేవిని సైతం ప్రత్యేకంగా ప్రశంసించారు. నవోదయ విద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పరీక్ష, ముఖాముఖిలో ప్రతిభ కనబరిచి హర్షిత ఈ జాతీయస్థాయి కార్యక్రమానికి ఎంపికైంది. దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థుల చొప్పున ఎంపిక చేసి అక్టోబరులో వారం రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా యోగా, సమయపాలన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, జీవితంలో లక్ష్యసాధనకు అవసరమైన విలువలపై హర్షిత అవగాహన పొందింది. కార్యక్రమంలో తాను నేర్చుకున్న అంశాలు, అనుభవాలను జిల్లా కలెక్టర్‌తో పంచుకుంది. విద్యార్థినిలో పెరిగిన ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సానుకూల దృక్పథాన్ని కలెక్టర్ అభినందించారు. జాతీయస్థాయి కార్యక్రమానికి పాఠశాల విద్యార్థిని ఎంపికై విజయవంతంగా పాల్గొనడం పాఠశాలతోపాటు ములుగు జిల్లాకు గర్వకారణమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షితను, గైడ్ టీచర్ రామాదేవిని అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. రహదారి నిబంధనలు పాటించాలి
- ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్



ములుగు, ఉదయం ప్రతినిధి నవంబరు 05:
విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్ సూచించారు. ములుగు డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలు, రహదారి భద్రత, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా అధికమవుతున్నాయని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలని, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని వివరించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ దారం సురేష్, ఎస్సై చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కె. మల్లేశం, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి పండుగ నేపథ్యంలో ఫైర్‌క్రాకర్స్ విక్రేతలతో ఆమన్‌గల్ పోలీసుల అవగాహన సమావేశం



మెట్రో ఉదయం ఆమనగల్ ప్రతినిధి రమేష్ నవంబర్ 5:
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో దీపావళి పండుగను పురస్కరించుకుని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ సిపి ఆదేశాల మేరకు, స్థానిక బాణసంచా (ఫైర్‌క్రాకర్స్) షాపు యజమానులతో ప్రత్యేక అవగాహన సమావేశంనిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆమన్‌గల్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.పండుగ సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని షాపు యజమానులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం అనుమతి పొందిన ప్రదేశాలలో మాత్రమే లైసెన్స్ కలిగిన షాపులను ఏర్పాటు చేయాలి.ప్రతి షాపు వద్ద సరిపడా నీటి బకెట్లు, ఇసుక మరియు మంటలను ఆర్పే పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలి. బాణసంచా షాపుల వద్ద ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండాలి మరియు “ధూమపానం నిషేధం” బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ అనుమతి లేని అనధికారిక, ప్రమాదకరమైన బాణసంచా విక్రయించకూడదు లైసెన్స్ నిబంధనలు మరియు అగ్నిమాపక భద్రతా సూత్రాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంతా సురక్షితంగా పండుగ జరుపుకోవడానికి వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై పిడిగుద్దులు.. కారు డ్రైవర్ అరెస్ట్

కంటోన్మెంట్ నవంబర్ 05 (మెట్రోఉదయం)
ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌పై ఓ కారు డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ సమీపంలో చోటుచేసుకుంది. డైమండ్ పాయింట్ నుంచి బోయిన్‌పల్లి వైపు వెళ్తున్న కారును ట్రాఫిక్ రద్దీ కారణంగా కానిస్టేబుల్ గడ్డం మహేందర్ (PC 5257) నిలిపివేశాడు. దీంతో ఆగ్రహించిన డ్రైవర్ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగి ముక్కుపై పిడిగుద్దులు కొట్టడంతో రక్తగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొంపల్లికి చెందిన నిందితుడు కె. శంకర్‌రావు (49)ను అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.

నూతన ఎమ్మార్వో ఉదయశ్రీని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ కురుమ సంఘం నేతలు



దౌల్తాబాద్, నవంబర్ 5 (మెట్రో ఉదయం జిల్లా ప్రతినిధి భాస్కర్ గౌడ్ అబ్బాగౌని)
నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉదయశ్రీ కి బీజేపీకి చెందిన కురుమ సంఘం నాయకులు మరియు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కురుమ గణేష్, ఓబీసీ మండల అధ్యక్షుడు తుమ్మల గణేష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా మీ శాఖకు సంబంధించిన పనులు పూర్తి చేసి మన్ననలను పొందాలని శాలువా కప్పి సత్కరించారు ఈ సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కురుమ గణేష్, ఓబీసీ మండల అధ్యక్షుడు తుమ్మల గణేష్‌లు నూతన తహసీల్దార్ ఉదయశ్రీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధితో పాటు ప్రజలకు ప్రభుత్వ రెవెన్యూ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందించాలని వారు ఆకాంక్షించారు. సామాన్య ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తూ, రైతులకు మరియు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

సూరారం ఆర్జీకే కాలనీ సమస్యలపై వారాల వినోద్ కుమార్‌కు ప్రజల వినతి

- సమస్యలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా: వారాల వినోద్ కుమార్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 05, ఉదయం:
సాయిబాబా నగర్ పరిధిలోని సూరారం కాలనీ రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రజలు గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు వివరించిన సమస్యలను వారాల వినోద్ కుమార్ సావధానంగా విన్నారు. ఆయా సమస్యలను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్య ఎదురైనా తనను సంప్రదించవచ్చని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీకే కాలనీకి చెందిన ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోకాపేటలో భట్రాజుల ఆత్మగౌరవ భవనానికి రూ.కోటి నిధులు మంజూరు!

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్రాజ సంఘం కృతజ్ఞతలు
- త్వరలోనే భూమిపూజ.. నిర్మాణ పనులకు శ్రీకారం



హైదరాబాద్ ప్రతినిధి, నవంబర్ 05, ఉదయం:
తెలంగాణ రాష్ట్ర భట్రాజ సంఘం చిరకాల స్వప్నమైన ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో గత ప్రభుత్వం సంఘానికి కేటాయించిన అర ఎకరం (20 గుంటల) స్థలంలో ఈ భవనాన్ని నిర్మించేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర భట్రాజ సంఘం అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజుకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీఓ) ప్రతిని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. భవన నిర్మాణ పనుల పర్యవేక్షణకు రాష్ట్ర సంఘం తరఫున సభ్యులు, ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. టెండర్ల ప్రక్రియ ద్వారా భవన నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కాగా, ప్రస్తుతం మంజూరైన రూ.కోటి నిధులు భవన నిర్మాణానికి సరిపోవని, మరిన్ని నిధులు కేటాయించాలని రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి.. నిర్మాణ పనులు ప్రారంభమైన అనంతరం అవసరమైన అదనపు నిధులను కూడా మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. భట్రాజుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవనున్న ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించి, పూర్తిచేసేందుకు రాష్ట్ర సంఘం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. సంఘం చిరకాల ఆకాంక్షను నెరవేర్చేందుకు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ చూపిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు, బిరుదరాజు రాజేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా హోల్‌సేల్ ఫ్రూట్స్ మర్చంట్ వెల్ఫేర్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



ఖమ్మం ప్రతినిధి. ఉదయం మెట్రో
ఖమ్మం : హోల్‌సేల్ ఫ్రూట్స్ మర్చంట్ వెల్ఫేర్ యూనియన్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా షేక్ జానీ మియా, గౌరవ అధ్యక్షులుగా ఏ. మల్లికార్జున్ రావు, ఉపాధ్యక్షులుగా షేక్ అబ్దుల్ నబీ, ప్రధాన కార్యదర్శిగా గరగ శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఎన్. వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎండీ ఉస్మాన్ అలీ, గౌరవ సలహాదారుగా ఏ. శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా షేక్ కరీం, షేక్ ఖాసిం లు ఎన్నికయ్యారు . ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఖానాపురంలో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు మూడు ఎకరాల 10 గుంటల స్థలం కేటాయించి, మార్కెట్ నిర్మాణానికి రూ. 18.72 కోట్లు మంజూరు చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తయితే సుమారు 10 వేల మందికి జీవనోపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఫ్రూట్ మార్కెట్‌కు త్వరితగతిన శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నూతన కమిటీ సభ్యులు కోరారు.

బేతుపల్లి చెరువు వరద ఉధృతిలో చిక్కుకున్న 10 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 9 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించిన సహాయక బృందాలు

- ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్, కలెక్టర్ దివాకర్ టిఎస్ సమయస్ఫూర్తి, సమర్థవంతమైన పర్యవేక్షణతో విజయవంతమైన సహాయక చర్యలు



సత్తుపల్లి ప్రతినిధి ఉదయం
సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో వరద ఉధృతిలో చిక్కుకున్న 9 మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది బోట్లు వరద ప్రవాహంలో చిక్కుకున్నాయి. ఈ ఘటనలో 10 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 9 మంది మత్స్యకారులు ప్రమాదంలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమయస్ఫూర్తితో అదనపు సహాయక బృందాలను రంగంలోకి దించి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేసి వరద ఉధృతిలో చిక్కుకున్న వారందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కూడా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యల పురోగతిని తెలుసుకుని, అవసరమైన సూచనలు చేస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న వారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరూ సురక్షితంగా బయటపడటంతో పోలీసు శాఖ, ప్రభుత్వ యంత్రాంగం, వారి కుటుంబ సభ్యులు ఊరట చెందారు. ఈ సందర్భంగా సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీసు, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రాణాలను కాపాడడంలో పోలీసు శాఖ చూపిన చొరవ, ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్, కలెక్టర్ దివాకర్ టిఎస్ సమయస్ఫూర్తితో కూడిన పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయంతో సహాయక చర్యలు విజయవంతంగా ముగిసాయి.

బాణసంచా దుకాణాలపై పోలీసుల నిఘా

- భద్రతా నిబంధనలు పాటించాలి.. అనుమతులకు మించి నిల్వ చేయొద్దు : ఇన్స్పెక్టర్ తిరుపతి రాజు



కంటోన్మెంట్, నవంబర్ 05 (మెట్రోఉదయం)
పండుగల వేళ బాణసంచా విక్రయాల్లో అప్రమత్తంగా ఉండాలని బోయిన్‌పల్లి పోలీసులు దుకాణ యజమానులకు సూచించారు. గురువారం సాయంత్రం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాణసంచా దుకాణాల యజమానులతో ఎస్‌హెచ్‌ఓ తిరుపతి రాజు, ఎస్ఐ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా నిల్వ, విక్రయాల సమయంలో తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. దుకాణాలకు సంబంధించి సరైన లైసెన్సులు, అవసరమైన అనుమతులు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అనుమతించిన పరిమితికి మించి బాణసంచా నిల్వ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పండుగల సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పోలీసులు దుకాణ యజమానులకు సూచించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే వేముల వీరేశం...



చిట్యాల, నల్లగొండ: నవంబర్ 05(మెట్రో ఉదయం):
రైతుల సౌకర్యార్థం గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చిట్యాల మండలంలోని ఆరేగూడెం, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు రవాణా ఇబ్బందులు తగ్గడంతోపాటు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు అవసరమైన సహకారం అందించాలని, కేంద్రాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయ్‌కుమార్, గ్రామ సర్పంచులు కాటం వెంకటేశం, ఆవుల సుందర్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వైస్ చైర్మన్ బొంతల ఆంజిరెడ్డి, మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, జిల్లా నాయకులు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, కొంపెల్లి వెంకటరెడ్డి, బండ అంజయ్య, కామాటి లింగయ్య, అంశల సత్యనారాయణ, అంతటి నర్సింహాగౌడ్, రాచమల్ల జానయ్య, వలిగొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

- సంగారెడ్డి జువైనల్ జస్టిస్ బోర్డులో న్యాయ అవగాహన కార్యక్రమం...
- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య.



సంగారెడ్డి జిల్లా (ఉదయం ప్రతినిధి నవంబర్ 5)
నవంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య సంగారెడ్డిలోని జువైనల్ జస్టిస్ బోర్డు కార్యాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి గారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు వివిధ న్యాయ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు మరియు సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థల ప్రధాన ఉద్దేశమని వివరించారు. బాలల హక్కులు, బాలల సంరక్షణ, రక్షణకు సంబంధించిన చట్టాలు మరియు ముఖ్యంగా బాలల న్యాయం (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం, 2015లోని ముఖ్యమైన నిబంధనల గురించి అవగాహన కల్పించారు. చట్టంతో సంఘర్షణలో ఉన్న బాలలు మరియు సంరక్షణ, రక్షణ అవసరమైన బాలల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి బాలుడికి, బాలికకు విద్య, ఆరోగ్యం, భద్రత, సంరక్షణ మరియు గౌరవప్రదమైన జీవితం పొందే హక్కు ఉందని తెలిపారు. బాలలపై ఎలాంటి హింస, వేధింపులు, వివక్ష, బాల కార్మికత్వం, బాల్యవివాహాలు మరియు ఇతర దోపిడీ చర్యలు జరగకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాలలు చట్టపరమైన సమస్యల్లో చిక్కుకున్నప్పుడు వారిని నేరస్థులుగా చూడకుండా, వారి వయస్సు, పరిస్థితులు మరియు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కౌన్సెలింగ్, పునరావాసం, విద్య మరియు సామాజిక పునరేకీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ద్వారా వారిని సమాజంలోని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. అలాగే బాలలపై జరిగే నేరాలకు సంబంధించి సంబంధిత అధికారులకు సమాచారం అందించడం, బాలల హక్కులకు భంగం కలిగినప్పుడు చట్టపరమైన సహాయం పొందడం, బాలల రక్షణ వ్యవస్థల సేవలను వినియోగించుకోవడం వంటి అంశాలపై వివరించారు. జువైనల్ జస్టిస్ బోర్డు ద్వారా బాలలకు అందించే న్యాయపరమైన సేవలు, బాలల కేసుల విచారణలో పాటించాల్సిన విధానాలు, బాలల గోప్యతను కాపాడాల్సిన ఆవశ్యకత మరియు బాలల ప్రయోజనాలే ప్రధాన ప్రాధాన్యతగా ఉండాలని వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన బాలలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయవాదుల సేవలు, అవసరమైన మార్గదర్శకత్వం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. న్యాయ సహాయం పొందడానికి ఎలాంటి భయం లేదా సంకోచం అవసరం లేదని, న్యాయం పొందడం ప్రతి ఒక్కరి హక్కు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్- కమ్ -అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కె. ధనలక్ష్మి గారు, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు శ్రీ వాసుదేవ్ రెడ్డి గారు, జువైనల్ జస్టిస్ బోర్డు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయవాది శ్రీ నిజాముద్దీన్ గారు, జువైనల్ జస్టిస్ బోర్డు లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది శ్రీ జె. శ్రీకాంత్ గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బాలల హక్కులు, బాలల సంక్షేమం, రక్షణ చట్టాలు మరియు ఉచిత న్యాయ సహాయ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు, న్యాయ సేవల దినోత్సవ వారోత్సవాల లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరిగింది.

పోక్సో కేసుల్లో సత్వర న్యాయానికి

పోలీసు, వైద్యుల సమన్వయం కీలకం

- ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో సీపీ సజ్జనర్ సమావేశం...



హైదరాబాద్, నవంబర్ 05: (మెట్రోఉదయం)
మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు. బషీర్‌బాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో గురువారం నగరంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన సుమారు 34 మంది వైద్యాధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోక్సో, అత్యాచార కేసుల దర్యాప్తులో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. బాధితులకు వైద్య పరీక్షలు త్వరగా పూర్తిచేసి, సమగ్ర నివేదికలను సకాలంలో పోలీసులకు అందజేస్తే నిర్ణీత గడువులోగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయడానికి వీలవుతుందన్నారు. తద్వారా నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా పటిష్ఠ ఆధారాలను కోర్టులో సమర్పించవచ్చని తెలిపారు.

బాలికలకు విస్తృత అవగాహన

సోషల్ మీడియా దుర్వినియోగం తదితర కారణాలతో 13, 14 ఏళ్ల బాలికలు సైతం మోసాలకు గురై నేరాల బారిన పడుతున్నారని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలను నివారించేందుకు పాఠశాలల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతోపాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

సమన్వయానికి ప్రత్యేక వ్యవస్థ

ఆసుపత్రుల్లో పోలీసుల విచారణ కారణంగా వైద్యుల విధులకు ఇబ్బందులు కలగకుండా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక సిబ్బందిని సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌గా నియమిస్తామని సీపీ తెలిపారు. పోలీసుల తరఫున ప్రత్యేక లైజన్ అధికారిని కూడా కేటాయించి సమాచార మార్పిడిని వేగవంతం చేస్తామన్నారు. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి డీసీపీ స్థాయి అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు నేరుగా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు. నేరం జరిగినప్పుడు చట్టం వేగంగా స్పందించినప్పుడే బాధితుల్లో భరోసా, నేరస్థుల్లో భయం కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్యులు తమ విధుల్లో ఎదురవుతున్న సమస్యలు, క్షేత్రస్థాయి అనుభవాలను సీపీ దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. పోలీసు అధికారులతో సమీక్షించి వైద్యులకు పూర్తి సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు సీపీ (క్రైమ్స్) ఎం. శ్రీనివాసులు, ఐపీఎస్, డీసీపీ (విమెన్ సేఫ్టీ వింగ్) లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్.. వచ్చే బుధవారం జాయింట్ ఇన్‌స్పెక్షన్‌కు ఆదేశం



సికింద్రాబాద్, నవంబర్ 05 (మెట్రో ఉదయం)
లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న గాంధీ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో స్థానిక కాలనీలు, అపార్ట్‌మెంట్ల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలపై గురువారం గాంధీ ఆస్పత్రిలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గాంధీ ఆస్పత్రిలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) లేకపోవడం వల్ల ఆస్పత్రి వ్యర్థాలు నేరుగా బయటకు వచ్చి నాలాలో చేరుతున్నాయని, దీంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి రోడ్లపైకి చేరుతోందని తలసాని వివరించారు. ఈ సమస్యను పద్మారావునగర్ నియోజకవర్గ పరిధిలోని స్థానికులు, అపార్ట్‌మెంట్ల వాసులు పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఎస్‌టీపీ నిర్మాణం కోసం రూ.3.45 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తలసాని తెలిపారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని అధికారులు ఆయనకు వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ప్రభుత్వంతోపాటు అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. వచ్చే బుధవారం సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన (జాయింట్ ఇన్‌స్పెక్షన్) నిర్వహించి, చేపట్టాల్సిన పనులపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గాంధీ ఆస్పత్రి మార్చురీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమస్యను పరిష్కరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి సూచించారు. గాంధీ ఆస్పత్రి నిర్మాణం వెనుక తన కృషి ఉందని తలసాని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ముషీరాబాద్ జైలును తరలించిన అనంతరం ఆ స్థలంలో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి నిర్మించాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మితమైన గాంధీ ఆస్పత్రి నేడు దేశంలోనే ప్రముఖ వైద్య సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. కరోనా మహమ్మారి సమయంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వేలాది మంది బాధితులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడిందని కొనియాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనూ ఆస్పత్రిని అనేక విధాలుగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదని, కనీసం సమీక్షలు కూడా నిర్వహించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన మౌలిక సదుపాయాలు, తగినంత సిబ్బంది, మందులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గాంధీతోపాటు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, జీహెచ్ఎంసీ ఎస్ఈ ఆశాలత, వాటర్ వర్క్స్ సీజీఎం వినోద్, జీఎం శ్రీధర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ డిప్యూటీ ఈఈ జగదీష్, జీహెచ్ఎంసీ ఏఈ మురళి, మాజీ కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, మహేందర్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగలక్ష్మి, సీమా, అభినవ్‌నగర్, వెంకటాపురం, పద్మారావునగర్ కాలనీలు, శాంభవి అపార్ట్‌మెంట్ ప్రతినిధులు బాల్‌రెడ్డి, వజీర్ మోహన్, రాజేశ్వర్ గౌడ్, కృష్ణారావు, రామారావు, దేశ్‌పాండే, చుంగి తదితరులు పాల్గొన్నారు.



మెట్రో ఉదయం
జాతీయ తెలుగు దిన పత్రిక
శుక్రవారం
06.11.2026

అజాతశత్రువు దామోదర రాజనర్సింహా

• రాజకీయ విలువలకు ప్రతిరూపం... ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనం.

సంగారెడ్డి జిల్లా (ఉదయం ప్రతినిధి)

ప్రత్యర్థుల విమర్శలకు చిరునవ్వే సమాధానం... కుట్రలకు అభివృద్ధే ప్రత్యుత్తరం... ప్రజలే ప్రాణంగా, సేవే పరమావధిగా సాగుతున్న రాజకీయ ప్రస్థానం! రాజకీయాలు అంటే పదవుల కోసం పాకులాడటం కాదు... ప్రజల ఆశయాలకు ప్రతిరూపంగా నిలవడం. రాజకీయ నాయకత్వం అంటే అధికారం చెలాయించడం కాదు... ప్రజల కన్నీళ్లను తుడిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపడం. మాటలతో మాయ చేయడం కాదు... చేతలతో చరిత్రను సృష్టించడం. అలాంటి రాజకీయ విలువలకు నిలువెత్తు నిదర్శనంగా, ప్రజాసేవనే తన జీవిత ధ్యేయంగా మలుచుకుని, రాజకీయ ఒడిదుడుకులను చిరునవ్వుతో ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్న నాయకుడు సిలారపు దామోదర రాజనర్సింహ గారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు ఉండవచ్చు... భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు... విమర్శలు, ఆరోపణలు సహజం. కానీ వ్యక్తిగత ద్వేషాలకు తావివ్వకుండా, రాజకీయ ప్రత్యర్థులను సైతం గౌరవిస్తూ, తనదైన సంయమనంతో ముందుకు సాగడం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా, ఎన్నో అవమానాలు ఎదురైనా, నమ్మినవారు వంచించినా, ప్రత్యర్థులు విమర్శించినా, తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా నిలబడే అరుదైన నాయకత్వమే దామోదర రాజనర్సింహ గారిది. అందుకే ఆయన రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలించినప్పుడు కనిపించేది కేవలం పదవుల పరంపర కాదు... విలువలతో కూడిన నాయకత్వం. కనిపించేది కేవలం రాజకీయ పోరాటం కాదు... ప్రజల పట్ల అచంచలమైన నిబద్ధత. వినిపించేది కేవలం ప్రసంగాల ప్రతిధ్వని కాదు... ప్రజాసేవ పట్ల ఆయనకున్న పట్టుదల.

ఆరు దశాబ్దాల కాంగ్రెస్ అనుబంధం... సిలారపు కుటుంబ రాజకీయ వారసత్వం

సిలారపు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం నిన్నమొన్నటి పరిచయం కాదు. దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ బంధం. ప్రజాసేవను కుటుంబ బాధ్యతగా స్వీకరించి, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల పట్ల విశ్వాసంతో ముందుకు సాగిన కుటుంబం సిలారపు కుటుంబం. దామోదర రాజనర్సింహ గారి తండ్రి సిలారపు రాజనర్సింహ గారు ఆందోల్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ ప్రజలతో మమేకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా మంత్రిగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించి, ప్రజాసేవలో తనదైన ముద్ర వేశారు. ఆ రాజకీయ వారసత్వాన్ని కేవలం కుటుంబ గౌరవంగా భావించకుండా, ప్రజల పట్ల బాధ్యతగా స్వీకరించిన నాయకుడు దామోదర రాజనర్సింహ గారు. సుమారు ఆరు దశాబ్దాలుగా సిలారపు కుటుంబం కాంగ్రెస్ పార్టీతో కొనసాగుతున్న అనుబంధం, పార్టీ పట్ల వారి విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. రాజకీయాల్లో అధికారం మారవచ్చు... పరిస్థితులు మారవచ్చు... అవకాశాలు మారవచ్చు... కానీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత మారకూడదనే భావనకు ఈ కుటుంబ రాజకీయ ప్రయాణం నిదర్శనం. ఎన్ని రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, కాంగ్రెస్ పార్టీని వీడకుండా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయడం వారి రాజకీయ విశ్వాసానికి ప్రతిబింబం. పార్టీని ఒక రాజకీయ వేదికగా మాత్రమే కాకుండా, ప్రజాసేవకు మార్గంగా భావించిన నాయకత్వం సిలారపు కుటుంబానిది.

1989 నుంచి ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం... అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు

1989లో ప్రారంభమైన దామోదర రాజనర్సింహ గారి రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ఎదుగుతూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ ముందుకు సాగింది. ఆందోల్ నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధిగా ఎన్నికై, ప్రజల సమస్యలను శాసనసభ వేదికపై వినిపిస్తూ తన రాజకీయ ప్రయాణానికి బలమైన పునాది వేసుకున్నారు. ప్రజల మధ్య నుంచి వచ్చిన నాయకుడిగా, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న వ్యక్తిగా, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ముందుకు సాగారు. రాజకీయాల్లో ఎదగడం ఒక ఎత్తయితే, ప్రజల మనసుల్లో స్థానం సంపాదించడం మరో ఎత్తు. ఆ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ సాగిన ఆయన ప్రయాణం ఆందోల్ రాజకీయ చరిత్రలో ప్రత్యేక గుర్తింపును సంతరించుకుంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా మంత్రిగా ప్రజల మద్దతు పొందడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రజలు ఇచ్చిన ప్రతి అవకాశాన్ని బాధ్యతగా భావించి, తనకు అప్పగించిన పదవికి న్యాయం చేయాలనే సంకల్పంతో పనిచేయడం ఆయన నాయకత్వ లక్షణం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత ఆయన రాజకీయ అనుభవానికి, నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనం. రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించినప్పటికీ, తన రాజకీయ మూలాలను మరచిపోకుండా ఆందోల్ ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించడం ఆయన ప్రత్యేకత.

తెలంగాణ సాధనలో కీలక పాత్ర... ఆత్మగౌరవానికి అండగా నిలిచిన నాయకుడు

తెలంగాణ రాష్ట్ర సాధన అనేది ఒక ప్రాంతపు ఆకాంక్ష మాత్రమే కాదు... తరతరాల ప్రజల ఆత్మగౌరవ పోరాటం. ఎన్నో దశాబ్దాల ఉద్యమం, అనేకమంది అమరవీరుల త్యాగాలు, ప్రజల అచంచల సంకల్పం కలగలిసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మార్గం సుగమం చేశాయి. ఆ చారిత్రక ప్రయాణంలో దామోదర రాజనర్సింహ గారు తనదైన పాత్రను పోషించారు. తెలంగాణ ఎందుకు అవసరమో, ప్రత్యేక రాష్ట్రం ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో పార్టీ అధిష్ఠానానికి వివరించడంలో ఆయన చూపిన పట్టుదల విశేషమైనది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాంగ్రెస్ పార్టీలోని నాయకులతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన సందర్భాల్లోనూ, తన ప్రాంత ప్రజల ఆకాంక్షలను బలంగా వినిపించారు. పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ముందు తెలంగాణ ఆవశ్యకతను సుదీర్ఘంగా వివరించి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు సంబంధించిన అంశాలను సమగ్రంగా ప్రస్తావించిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. తెలంగాణ ఉద్యమంలో అమరవీరుల త్యాగాలను, ప్రజల ఆకాంక్షలను, ప్రాంతీయ వెనుకబాటుతనాన్ని తన నివేదికల ద్వారా అధిష్ఠానానికి వివరించి, రాష్ట్ర సాధన దిశగా చర్చలకు బలమైన ఆధారాలను అందించడంలో ఆయన పాత్ర ప్రస్తావనీయమైనది. తెలంగాణ సాధన కోసం తన రాజకీయ భవిష్యత్తును సైతం పణంగా పెట్టి, తన ప్రాంత ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయన రాజకీయ నిబద్ధతకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న నాయకుడు.

పదవులు అలంకారం కాదు... ప్రజాసేవకు బాధ్యత

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేశారు. విద్య అనేది పేదవాడి జీవితాన్ని మార్చగల శక్తి అని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని భావించే నాయకత్వం ఆయనది. విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గంలో అనేక విద్యాసంస్థల నిలకొల్పి తనదైన ముద్ర వేయడానికి కృషి చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పనిచేశారు. వైద్యం అనేది సంపన్నులకే పరిమితమైన సౌకర్యం కాకుండా, సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండాల్సిన ప్రాథమిక హక్కు అనే భావనతో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆందోల్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆసుపత్రుల నిర్మాణం, వైద్య సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా వైద్య సేవలను మెరుగుపరిచే దిశగా కృషి చేశారు. ఏ పదవి వచ్చినా ఆ పదవికి న్యాయం చేయాలనే తపన ఆయనలో కనిపిస్తుంది. పదవి అనేది వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం కాదు... ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడాలనే ఆలోచన ఆయన రాజకీయ దృక్పథంలో ప్రధానంగా నిలుస్తుంది.

ఆందోల్ అభివృద్ధే లక్ష్యం... ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఆందోల్ నియోజకవర్గం అంటే దామోదర రాజనర్సింహ గారికి కేవలం రాజకీయ పరిధి కాదు... తన ప్రజలతో ముడిపడిన అనుబంధం. నియోజకవర్గ అభివృద్ధిని తన బాధ్యతగా భావిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలు ప్రజల జీవన ప్రమాణాలను నిర్ణయిస్తాయి. ఈ రంగాల్లో అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమైన అంశం. అభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు... ప్రజలకు అవకాశాలు కల్పించడం. అభివృద్ధి అంటే కేవలం రహదారులు వేయడం కాదు... ప్రజల జీవిత ప్రయాణాన్ని సులభతరం చేయడం. అభివృద్ధి అంటే కేవలం గణాంకాలు కాదు... సామాన్యుడి ముఖంలో చిరునవ్వు చూడడం. ఈ భావనతో ఆందోల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండే నాయకుడిగా, ప్రజలతో మమేకమయ్యే వ్యక్తిగా తనదైన గుర్తింపును కొనసాగిస్తున్నారు.

అజాతశత్రువు... వ్యక్తిత్వమే ఆయనకు ఆభరణం

రాజకీయాల్లో విమర్శలు ఎదుర్కోవడం సహజం. కానీ విమర్శలకు ప్రతిగా వ్యక్తిగత దూషణలకు దిగకుండా, తన రాజకీయ విలువలను కాపాడుకోవడం గొప్ప నాయకత్వ లక్షణం. దామోదర రాజనర్సింహ గారి వ్యక్తిత్వంలో కనిపించే ప్రధానమైన లక్షణం ఇదే. రాజకీయ ప్రత్యర్థులతో విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత శత్రుత్వానికి తావివ్వకుండా, అందరితో కలుపుగోలుగా ఉండే స్వభావం ఆయనది. సూటిగా మాట్లాడటం ఆయన నైజం. తప్పు కనిపిస్తే ముఖం ముందే చెప్పే ధైర్యం ఆయన వ్యక్తిత్వం. నమ్మినవారిని గుండెల్లో పెట్టుకుని చూసుకోవడం ఆయన మంచితనం. తనను విమర్శించిన వారిని సైతం వ్యక్తిగతంగా కించపరచకుండా, రాజకీయ పరిమితుల్లోనే స్పందించడం ఆయన సంయమనం. రూపంలో నరసింహుడి గంభీరత... మాటలో స్పష్టత... మనసులో మంచితనం... ఆలోచనలో పట్టుదల... ఆచరణలో ప్రజాసేవ... ఇవన్నీ కలగలిసిన నాయకత్వమే దామోదర రాజనర్సింహ గారిది. ఎన్ని కుట్రలు ఎదురైనా, ఎన్ని విమర్శలు వచ్చినా, ఎంతటి రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగడం ఆయన ధైర్యానికి ప్రతీక. ప్రత్యర్థులు ఎన్ని మాటలు అన్నా, ప్రజల కోసం చేయాల్సిన పనిని కొనసాగించడమే తన మార్గంగా ఎంచుకున్నారు.

నమ్మినవారికి అండ... కార్యకర్తలకు భరోసా

రాజకీయ నాయకుడి బలం ఆయన పదవి కాదు... ఆయన వెంట నడిచే కార్యకర్తలు. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి, వారి నిబద్ధతను గౌరవించి, వారిని కుటుంబ సభ్యుల్లా చూసుకునే నాయకత్వం రాజకీయాల్లో అరుదుగా కనిపిస్తుంది. దామోదర రాజనర్సింహ గారు తనను నమ్మి వచ్చినవారికి అండగా నిలబడే వ్యక్తిగా గుర్తింపు పొందారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను ప్రోత్సహించడం, వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రజాసేవలో వారికి అవకాశాలు కల్పించడం వంటి అంశాల్లో ఆయన చూపే చొరవ కార్యకర్తలకు భరోసానిస్తుంది. రాజకీయ జీవితంలో



నమ్మినవారు వంచించిన సందర్భాలు ఉండవచ్చు. ప్రత్యర్థులు విమర్శించిన సందర్భాలు ఉండవచ్చు. అయినప్పటికీ, వాటిని జీవిత ప్రయాణంలో ఎదురయ్యే అనుభవాలుగా స్వీకరించి ముందుకు సాగడం ఆయన మనోధైర్యానికి నిదర్శనం. ఆపదలో ఆదుకునే ఆపన్న హస్తంగా, కష్టకాలంలో అండగా నిలిచే నాయకుడిగా, ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించే వ్యక్తిగా ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబం... భిన్నాభిప్రాయాలు సహజం

కాంగ్రెస్ పార్టీ అనేది విభిన్న భావాలు, విభిన్న ప్రాంతాలు, విభిన్న వ్యక్తిత్వాలు కలగలిసిన ఒక విశాలమైన రాజకీయ వేదిక. ఒక కుటుంబంలో అన్నదమ్ముల మధ్య భిన్నాభిప్రాయాలు వచ్చినంత మాత్రాన కుటుంబ బంధం తెగిపోదు. చర్చలు జరుగుతాయి... అభిప్రాయాలు వ్యక్తమవుతాయి... చివరికి అందరూ కలిసి ముందుకు సాగుతారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీలోనూ భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. వాటిని పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి ప్రతీకగా చూడాలి. చిన్నచిన్న విభేదాలను పెద్ద రాజకీయ సంక్షోభాలుగా చిత్రీకరించడం, వాటిని ఆధారంగా చేసుకుని పార్టీపై దుష్ప్రచారం చేయడం ప్రజాస్వామ్య రాజకీయాలకు ఆరోగ్యకరం కాదు. పార్టీలో ఎవరి అభిప్రాయాలు వారికుండవచ్చు. నాయకుల మధ్య చర్చలు జరగవచ్చు. కానీ పార్టీ లక్ష్యం ప్రజాసేవ, ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనే విషయాన్ని మరచిపోకూడదు. కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి దిశగా నడిపించడంలో ప్రతి నాయకుడికి, ప్రతి కార్యకర్తకు బాధ్యత ఉంది. భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూ, ఐక్యతను కాపాడుకుంటూ ముందుకు సాగడమే పార్టీ బలానికి మూలం.

సోషల్ మీడియా విమర్శలకు అభివృద్ధే సమాధానం

ప్రస్తుతం సోషల్ మీడియా రాజకీయ ప్రచారానికి ప్రధాన వేదికగా మారింది. ఒక చిన్న సంఘటనను పెద్దదిగా చూపించడం, భిన్నాభిప్రాయాలను వివాదాలుగా చిత్రీకరించడం, రాజకీయ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం వంటి ధోరణులు పెరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకునే అంతర్గత చర్చలను ఆధారంగా చేసుకుని, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం సహజమే. అయితే ప్రజలు గమనించేది కేవలం సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు కాదు... నాయకులు ప్రజల కోసం చేస్తున్న పనులు. ఒక నాయకుడి విలువను నిర్ణయించేది ప్రచార పోస్టులు కాదు... ఆయన ప్రజాసేవ. ఒక నాయకుడి బలాన్ని కొలిచేది విమర్శల సంఖ్య కాదు... ప్రజల విశ్వాసం. ఒక నాయకుడి చరిత్రను రాసేది ప్రత్యర్థుల వ్యాఖ్యలు కాదు... ఆయన చేసిన అభివృద్ధి పనులు. దామోదర రాజనర్సింహ గారి రాజకీయ ప్రస్థానాన్ని కూడా ఈ కోణంలోనే చూడాలి. దశాబ్దాల రాజకీయ అనుభవం, ప్రజాప్రతినిధిగా బాధ్యతలు, రాష్ట్ర స్థాయి పదవులు, తెలంగాణ సాధనలో పాత్ర, ఆందోల్ అభివృద్ధి పట్ల నిబద్ధత వంటి అంశాలే ఆయన రాజకీయ జీవితానికి అసలైన కొలమానాలు.

దేశ రాజకీయాల్లోనూ ప్రత్యేక గుర్తింపు

రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కీలక బాధ్యతల్లో భాగస్వామ్యం కావడం దామోదర రాజనర్సింహ గారి రాజకీయ అనుభవానికి ప్రతీక. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వంటి కీలక వేదికల్లో బాధ్యతలు నిర్వహించడం, పార్టీ విధానాలు మరియు నిర్ణయాల ప్రక్రియలో భాగస్వామ్యం కావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన అధ్యాయం. ప్రాంతీయ సమస్యలను జాతీయ స్థాయిలో వినిపించగలగడం, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను పార్టీ వేదికలపై ప్రస్తావించడం, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయడం వంటి అంశాలు ఆయన నాయకత్వానికి ప్రత్యేకతను తీసుకొస్తాయి.

విమర్శల మధ్య నిలిచే వ్యక్తిత్వం... ప్రజల మధ్య నిలిచే నాయకత్వం

రాజకీయ జీవితంలో ప్రతి ఒక్కరికీ అనుకూల పరిస్థితులు ఉండవు. కొన్నిసార్లు విజయాలు పలకరిస్తాయి... మరికొన్నిసార్లు ఓటములు ఎదురవుతాయి. కొన్నిసార్లు నమ్మినవారు అండగా నిలుస్తారు... మరికొన్నిసార్లు దూరమవుతారు. అయితే ఈ పరిస్థితులన్నింటినీ జీవితంలో భాగంగా స్వీకరించి, తన లక్ష్యాన్ని మరచిపోకుండా ముందుకు సాగడం గొప్ప నాయకుడి లక్షణం. దామోదర రాజనర్సింహ గారు కూడా రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, తనదైన పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ప్రత్యర్థుల విమర్శలకు వ్యక్తిగత దూషణలతో సమాధానం చెప్పడం కన్నా, ప్రజల కోసం చేసే పనులతో సమాధానం చెప్పాలనే ధోరణి ఆయన వ్యక్తిత్వంలో కనిపిస్తుంది. తనను నమ్మినవారికి అండగా నిలవడం, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం, పార్టీ కార్యకర్తలను ప్రోత్సహించడం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలే ఆయన రాజకీయ జీవితానికి నిజమైన బలం.

ప్రజల గుండెల్లో నిలిచే నాయకుడు

సిలారపు కుటుంబ రాజకీయ వారసత్వం నుంచి ప్రారంభమైన ప్రస్థానం... కాంగ్రెస్ పార్టీ పట్ల దశాబ్దాల నిబద్ధత... 1989 నుంచి సాగుతున్న రాజకీయ ప్రయాణం... నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజల ప్రాతినిధ్యం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు... తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర... విద్యా, వైద్య రంగాల్లో సేవలు... ఆందోల్ అభివృద్ధి పట్ల అంకితభావం... ఇవన్నీ దామోదర రాజనర్సింహ గారి రాజకీయ జీవితంలోని ముఖ్యమైన అధ్యాయాలు. ఆయనకు రాజకీయాలు ఒక పదవీ వ్యామోహం కాదు... ప్రజాసేవకు ఒక మార్గం. అధికారం ఒక అలంకారం కాదు... బాధ్యతకు ఒక గుర్తింపు. విమర్శలు ఒక అడ్డంకి కాదు... మరింత పట్టుదలతో ముందుకు సాగేందుకు ఒక అనుభవం. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండే అజాతశత్రువు... నమ్మినవారికి అండగా నిలిచే మంచి మనసున్న నాయకుడు... తప్పును తప్పుగా చెప్పే ధైర్యవంతుడు... ప్రజల కోసం నిరంతరం పనిచేసే కార్యదీక్షాపరుడు... అభివృద్ధిని తన మంత్రంగా భావించే రాజకీయ నాయకుడు... సిలారపు దామోదర రాజనర్సింహ గారు. రాజకీయాల్లో ఎవరు ఎన్ని విమర్శలు చేసినా, కాలమే నాయకుడి నిజమైన విలువను నిర్ణయిస్తుంది. సోషల్ మీడియాలో ఎన్ని పోస్టులు వచ్చినా, ప్రజల హృదయాల్లో నిలిచే స్థానం మాత్రం సేవతోనే సంపాదించగలరు. ఆయన నమ్మిన సిద్ధాంతం కాంగ్రెస్... ఆయన ఎంచుకున్న మార్గం ప్రజాసేవ... ఆయన లక్ష్యం ఆందోల్ అభివృద్ధి... ఆయన రాజకీయ ప్రస్థానానికి చిరునామా ప్రజల విశ్వాసం. అందుకే దామోదర రాజనర్సింహ గారి రాజకీయ ప్రయాణం ఒక వ్యక్తి ఎదుగుదల మాత్రమే కాదు... విలువలతో కూడిన నాయకత్వానికి, పట్టుదలకు, ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనం. అజాతశత్రువుగా... అభివృద్ధి ప్రదాతగా... ప్రజల మనిషిగా... రాజకీయ విలువలకు ప్రతీకగా... దామోదర రాజనర్సింహ గారు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు సిలారపు



వ్యాసకర్త
ఉమ్మన్నగారి కృష్ణాగౌడ్
కవి గేయ రచయిత CDR

బీఆర్ఎస్ యువజన నాయకుడి మృతికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నివాళులు...



చిట్యాల, నల్లగొండ: నవంబర్ 05(మెట్రో ఉదయం):
చిట్యాల మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు చిత్రగంటి ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. తొలుత చిత్రగంటి ప్రవీణ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు చిత్రగంటి నాగరాజు, నవీన్, ప్రణీత్‌లను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చిత్రగంటి ప్రవీణ్ అకాల మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. యువజన విభాగంలో చురుకుగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేసిన ప్రవీణ్ మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, రుద్రవరం సునీల్, మేడి రాజు, కడియాల నందకిషోర్, జమాండ్ల చందురెడ్డి, రుద్రవరం మధు, మేకల ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సహాయం...



చిట్యాల, నల్లగొండ: నవంబర్05 (మెట్రో ఉదయం):
చిట్యాల మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు చిత్రగంటి ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు అండగా నిలిచారు. గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం చిట్యాల మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో రూ.31 వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో పార్టీ నాయకులు ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. చిత్రగంటి ప్రవీణ్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు నిమ్మగోటి శ్రీనివాస్, షబానా అజీమ్, నాయకులు జిట్ట బొందయ్య, బొబ్బలి శివశంకర్‌రెడ్డి, ఆగు అశోక్, రుద్రవరం యాదయ్య, బోల్గూరి సైదులు, ఆవుల ఆనంద్, జిట్ట శేఖర్, సాయిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పోకల రాములు, కునూరు శంకర్, జమాండ్ల చందు, తోటకూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్‌కు కలెక్టర్, ఎస్పీ అభినందనలు



చిట్యాల, నల్లగొండ: నవంబర్ 05(మెట్రో ఉదయం):
చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్ గుజరాత్‌లో నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్- 2026 వేడుకల్లో పాల్గొని గ్రామానికి తిరిగి వచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యత, సమగ్రతను చాటిచెప్పే లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొని తిరిగి వచ్చిన సుందరయ్య యాదవ్‌ను జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు. ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. జాతీయ సమైక్యత, ఐక్యతా భావాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించడం తనకు ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు జిల్లా అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నూతన తాసిల్దార్‌కి ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగరాజు శాలువా సత్కారం



దౌల్తాబాద్ నవంబర్ 05 (మెట్రో ఉదయం జిల్లా ప్రతినిధి అబ్బాగౌని భాస్కర్ గౌడ్)
దౌల్తాబాద్ నూతన తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన ఉదయశ్రీని మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగరాజు వారి ఉప సర్పంచ్ లతో కలిసి మర్యాదపూర్వకంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి, మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ తరఫున సహకారం అందించాలని కోరారూ. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా నాయకులు ఆది బాలకృష్ణ మరియు డిప్యూటీ తాసిల్దార్ జహీర్, ఉప్పరిపల్లి నాగరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ నుంచి సిద్దిపేటకు నూతన బస్సు సర్వీసు ప్రారంభం

- విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ఎంతో ప్రయోజనం
- సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ -రమేష్ మరియు పాలక వర్గం ఆధ్వర్యంలో ప్రారంభం



దౌల్తాబాద్, నవంబర్ 05 (మెట్రో ఉదయం జిల్లా ప్రతినిధి అబ్బాగౌని భాస్కర్ గౌడ్):
మండల కేంద్రమైన దౌల్తాబాద్ గ్రామ ప్రజల చిరకాల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దౌల్తాబాద్ నుంచి సిద్దిపేటకు నూతన బస్సు సర్వీసును బుధవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ -రమేష్ ఆధ్వర్యంలో ఈ బస్సు సర్వీసుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దౌల్తాబాద్ నుంచి సిద్దిపేటకు నూతన బస్సు సర్వీసు అందుబాటులోకి రావడం మండల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం నిత్యం సిద్దిపేటకు వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులోకి వచ్చిన ఈ సౌకర్యాన్ని ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దౌల్తాబాద్ నుంచి సిద్దిపేటకు బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉండడం ప్రయాణికులకు మరింత వెసులుబాటు కల్పించనుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడితే విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు వంశీ, లక్ష్మి చందర్, బీఆర్ఎస్ నాయకులు నరేష్, పవన్, నర్సిములు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

- అర్హులైన పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది: ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్, నవంబర్ 05 :
సికింద్రాబాద్ మండలానికి చెందిన 12 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చెక్కులను పంపిణీ చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతని స్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆడబిడ్డల వివాహం ప్రతి తల్లిదండ్రులకు ఎంతో ముఖ్యమైన బాధ్యత అని, వివాహ సమయంలో పేద కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని పేర్కొన్నారు. ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించి వారి కుటుంబాల్లో ఆనందం నింపడమే ఈ పథకాల ముఖ్య ఉద్దేశమన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య యాదవ్



దౌల్తాబాద్, నవంబర్ 5 (మెట్రో ఉదయం జిల్లా ప్రతినిధి అబ్బాగౌని భాస్కర్ గౌడ్):
రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి సూచించారు. దౌల్తాబాద్ మండలంలోని దౌల్తాబాద్, సూరంపల్లి, లింగరాజుపల్లి, గువ్వలేగి, గోవిందాపూర్, ఉప్పరిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు, ఐకేపీ సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, తూకం, నాణ్యత పరిశీలన తదితర అంశాల్లో పారదర్శకత పాటించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరి కోతలు పూర్తయిన వెంటనే రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రైతుల ఖాతాల్లో నగదు సకాలంలో జమయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి మరియు దౌల్తాబాద్ తహశీల్దార్ ఉదయశ్రీ, ఎంపీడీవో సయ్యద్ గఫూర్ ఖాద్రి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి, ఆయా గ్రామాల సర్పంచులు ముచ్చమర్రి అనురాధ-రమేష్, ఐకేపీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక శిబిరం

- అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి



సికింద్రాబాద్, నవంబర్ 05 (మెట్రో ఉదయం):
సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అర్హులైన పట్టభద్రులందరి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఇన్‌చార్జి ఆడం సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. మెట్టుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు సహాయ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆడం సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా చూడాలని, ప్రతి ఒక్కరికీ ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. శిబిరం నిర్వాహకుడు ర్యాల రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.. 2023 అక్టోబర్ నాటికి డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన అర్హులైన వారిని పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మెట్టుగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రతివ్ రాజ్, టెంపుల్ శ్రీను, శ్రీనివాస్, గడ్డం మహేందర్, మహిళా నాయకులు సుజాత, నిర్మల, సంతోషి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద నగర్‌లో శ్రీలక్ష్మి చిన్నారుల వైద్య, క్యాన్సర్ చికిత్స కేంద్రం ప్రారంభం

- కాలనీవాసులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి
- రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి



కూకట్ పల్లి, నవంబర్ 05 (మెట్రో ఉదయం)
శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి చిన్నారుల వైద్య, క్యాన్సర్ చికిత్స కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం 10.30 గంటలకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధిని సమక్షంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి రాంచందర్ రావు, కమిటీ సభ్యులు పాల్గొని వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ్యవర్ధినిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు కాలనీవాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చిన్నారులకు, ఇతర రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, తగిన చికిత్స అందించాలని కోరారు. ఈ వైద్య కేంద్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ మరింత మందికి వైద్య సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ వైద్యులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సహకరించిన కమిటీ సభ్యుడు పి. సూర్య నారాయణకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు జి. ప్రసాద్, టైగర్ పురుషోత్తం, లక్ష్మీనారాయణ, మూర్తి, వెంకటేశ్వరరావు, జి. నర్సింగరావు, కిషోర్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి. సూర్యనారాయణ కార్యక్రమానికి హాజరైన కాలనీవాసులకు, అసోసియేషన్ కమిటీ సభ్యులకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

ఓటు బచావో - దేశ్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణం
- టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్



కూకట్‌పల్లి, నవంబర్ 05 (మెట్రో ఉదయం)
ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఓటులి బచావో - దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసి తిరిగి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులను అభినందిస్తూ గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్‌లో సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ఢిల్లీలో నిర్వహించిన 'ఓటు బచావో - దేశ్ బచావో' కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల ద్వారా తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే వేముల వీరేశం...



చిట్యాల,నల్లగొండ:నవంబర్ 05(మెట్రో ఉదయం):
రైతుల సౌకర్యార్థం గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. చిట్యాల మండలంలోని ఆరేగూడెం, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు రవాణా ఇబ్బందులు తగ్గడంతోపాటు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు అవసరమైన సహకారం అందించాలని, కేంద్రాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయ్‌కుమార్, గ్రామ సర్పంచులు కాటం వెంకటేశం, ఆవుల సుందర్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వైస్ చైర్మన్ బొంతల ఆంజిరెడ్డి, మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, జిల్లా నాయకులు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, కొంపెల్లి వెంకటరెడ్డి, బండ అంజయ్య, కామాటి లింగయ్య, అంశల సత్యనారాయణ, అంతటి నర్సింహాగౌడ్, రాచమల్ల జానయ్య, వలిగొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన మండల అధికారులు



చింతకాని, నవంబర్ 5 మెట్రో ఉదయం
చింతకాని, మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ అయిన లబ్ధిదారుల ఇళ్లకెళ్లి పరిశీలించిన ఎండిఓ. శ్రీనివాసరావు. హౌసింగ్ ఏఈ సుప్రియ లబ్ధిదారు ఇళ్ళకి వెళ్లి స్వయంగా పరిశీలించిన అధికారులు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రామారావు. పంచాయతీ సెక్రెటరీ మురళి. గ్రామకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు. బెల్లం చిన్న పుల్లయ్య. గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్‌లో రెండో ఇండీ కామిక్స్ ఫెస్ట్ ఘనంగా నిర్వహణ



అంబర్ పేట్, నవంబర్ 5 (మెట్రో ఉదయం):
సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రెండో ఇండీ కామిక్స్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కామిక్స్ అభిమానులు, కళాకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీఎఫ్ హైదరాబాద్ చాప్టర్ ఆర్గనైజర్ లిఖిత్ కుమార్ తిరుకోవెల మాట్లాడుతూ.. ఈ ఉత్సవం పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలు, కథలు చెప్పే నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు స్టోరీ టెల్లింగ్ రంగంలోని నిపుణులకు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకునే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. నాన్ ప్రాఫిట్ వేదికగా కొనసాగుతున్న ఇండీ కామిక్స్ ఫెస్ట్ ప్రతి సంవత్సరం బెంగళూరు, ఢిల్లీ, ముంబై, కొచ్చి తదితర నగరాల్లో నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న కామిక్ కళాకారులను ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన కళాకారులు తమ సృజనాత్మక కామిక్ పుస్తకాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందుతున్న కళాకారులు, విద్యార్థుల, వృత్తిపరుల కోసం కామిక్స్ రచన, స్కెచింగ్, ఐడియేషన్ అంశాలపై ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ నిర్వహించారు. అలాగే అకర్మా సంస్థ ఆధ్వర్యంలో మెట్ల బావుల సంరక్షణ, నిర్వహణపై ప్రత్యేక వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. కళాకారుల సృజనాత్మకతకు, కొత్త ఆలోచనలకు వేదికగా నిలిచిన రెండో ఇండీ కామిక్స్ ఫెస్ట్ హైదరాబాద్‌లో సందడి నెలకొల్పింది.

ప్రధానోపాధ్యాయున్ని విధుల్లోనుండి తొలగించాలి...

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరీష్, అన్వర్ ఎంఈఓకు వినతి..



మేడిపల్లి నవంబర్ 5 (మెట్రో ఉదయం)
మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని కమలానగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, మద్యం మత్తులో విద్యార్థులను దూషిస్తున్నందున వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్,అన్వర్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల విద్యాధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాబుద్దులు నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయులు భాస్కర్ నిత్యం మద్యం మత్తులో పాఠశాలకు వస్తూ తమ బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తున్నారు. విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషించడమేకాక తరగతి గదినే పడకగదిగా మార్చుకుని టేబుల్‌పై కాళ్లు పెట్టుకుని నిద్రిస్తూ పాఠశాల వాతావరణాన్ని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని, విద్యావ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్న హెచ్ఎం ప్రవర్తన వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ పాఠశాలకు రావడానికి పిల్లలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని హెచ్.ఎం భాస్కర్ ని తక్షణమే విధుల్లోనుంచి తొలగించి ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆయనపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్రైటన్ బ్లూమ్ స్కూల్‌లో ఘనంగా స్పెల్ బీ జోనల్ పోటీలు

- ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌ను కలిసిన రాంపూర్ శాలివాహన నాయకులు



మెట్రో ఉదయం ఆమనగల్ ప్రతినిధి రమేష్ నవంబర్ 5:
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ను హైదరాబాద్ లో వారి నివాసంలో రాంపూర్ గ్రామ శాలివాహన నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అదేవిధంగా శాలివాహన సంఘానికి కావలసిన సిమెంటు, సీకులు శాలివాహన సంఘానికి అందజేయాలని వెంకటేష్ ను కోరడం జరిగింది. ఇట్టి విషయంపై వెంకటేష్ సానుకూలంగా స్పందించి తప్పకుండా సంఘానికి సహాయం అందజేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం సంఘం అధ్యక్షులకు శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల-శ్రీశైలం యాదవ్ , ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు , మాజీ ఎంపిటిసి కటికల భీమమ్మ-యాదయ్య, మాజీ సర్పంచి మణెమ్మ- యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ యెన్నం మోహన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు, శాలివాహన సంఘం అధ్యక్షులు: దుర్గాపురం వెంకటేష్, ఉపాధ్యక్షులు దుర్గపురం రాజు, నాయకులు: మాజీ డైరెక్టర్ ణ.శ్రీను,ణ.పెద్ద మల్లయ్య, డి.కృష్ణయ్య,డి.పెద్ద జంగయ్య, మాజీ డైరెక్టర్ ణ.జంగిలి, ణ.మల్లేష్ ణ. తిరుపతి,ణ.మల్లేష్, ణ. జంగిలి, ణ. అభిలాష్,ణ.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారి నివాసంలో లబ్ధిదారులకు సిఆర్ఎమ్ఎఫ్ చెక్కులు, పిఎసిఎస్ చైర్మన్లకు ఆర్డర్ కాపీల అందజేత



మెట్రో ఉదయం ఆమనగల్ ప్రతినిధి రమేష్ నవంబర్ 5:
నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మరియు ఎల్.ఓ.సి. పత్రాలను ఆయా మండలాల ముఖ్య నాయకుల సమక్షంలో అందజేశారు. లబ్ధిదారులను వ్యక్తిగతంగా పలకరించి, చికిత్సకు ఎటువంటి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతనంగా నియమితులైన చైర్మన్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కల్వకుర్తి మండల చైర్మన్‌గా రఘుపతిపేటకు చెందిన హరీష్ రెడ్డి, ఆమనగల్ మండల చైర్మన్‌గా కడ్తాల్ గ్రామానికి చెందిన గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వెల్దండ మండల చైర్మన్‌గా భూపతి రెడ్డి నియమితులయ్యారు. నూతన చైర్మన్లు ఎమ్మెల్యే గారిని శాలువా, పూలమాలతో సత్కరించగా, ఎమ్మెల్యే గారు వారికి ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ వ్యవస్థకు రైతే కేంద్రబిందువని, ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు వంటి సేవలు రైతులకు సకాలంలో అందేలా, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పని చేయాలని నూతన చైర్మన్లకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే గారు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతామని, రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని

ఆంగ్ల భాషా నైపుణ్యాలు, పదజాలం పెంపొందించేందుకు పోటీలు దోహదం

- బ్రైటన్ బ్లూమ్ స్కూల్ డైరెక్టర్ లు జ్యోత్స్న, శాంతి, మాలతి



ఇబ్రహీంపట్నం, నవంబర్ 5 (మెట్రో ఉదయం) :
విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, భాషా పరిజ్ఞానం, పదజాలం, ఉచ్చారణ మరియు సరైన స్పెల్లింగ్ రాసే నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా బ్రైటన్ బ్లూమ్ స్కూల్ ఆధ్వర్యంలో స్పెల్ బీ జోనల్ పోటీలను ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేట్‌లోని బ్రైటన్ బ్లూమ్ స్కూల్ బ్రాంచ్‌లో గురువారం నిర్వహించిన ఈ పోటీలు విద్యార్థుల ఉత్సాహం, ప్రతిభాపాటవాలతో సందడిగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ జ్యోత్స్న, శాంతి, మాలతి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు ఎంతో అవసరమని పేర్కొన్నారు. స్పెల్ బీ వంటి పోటీలు కేవలం పదాల స్పెల్లింగ్‌ను గుర్తించడం, రాయడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, భాషా నైపుణ్యాలను పెంపొందిస్తాయని వివరించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో రాణించేందుకు ప్రేరణ లభిస్తుందని తెలిపారు. ఈ జోనల్ స్థాయి పోటీల్లో ఇబ్రహీంపట్నం, బడంగ్‌పేట్ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు తమ ఆంగ్ల పదజాల పరిజ్ఞానాన్ని, స్పెల్లింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. పోటీదారులు ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల ముగింపు సందర్భంగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలను అభినందించిన అతిథులు, పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి అభినందనీయుడేనని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన వేదిక కల్పించడం ద్వారా విద్యాపరంగా, వ్యక్తిగతంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే బ్రైటన్ బ్లూమ్ స్కూల్ ప్రధాన లక్ష్యమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. పాఠ్యాంశాలతో పాటు ఇలాంటి సృజనాత్మక, విజ్ఞానాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడంతో స్పెల్ బీ జోనల్ పోటీలు విజయవంతంగా ముగిశాయి.

ఆమనగల్లు మున్సిపాలిటీలో మానవత్వం చాటుకున్న కౌన్సిలర్ పాపిశెట్టి రాము



మెట్రో ఉదయం ఆమనగల్ ప్రతినిధి రమేష్ నవంబర్ 5:
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం అమంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన సుగుణమ్మ భర్త యాదయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని, ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు మరియు కౌన్సిలర్ అయిన పాపిశెట్టి రాము మానవతా దృక్పథంతో స్పందించారు. సుగుణమ్మ వైద్య నిమిత్తం వారికి ఆర్థిక సహాయాన్ని అందజేసి, కుటుంబానికి భరోసానిచ్చారు. కష్టకాలంలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలవడం చాలా అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాపిశెట్టి రాముతో పాటు వారి మిత్రబృందం, కుటుంబ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

డీజేఎఫ్ జిల్లా కార్యదర్శిగా కామగళ్ల నరేష్ నియామకం

- జాతీయ అవార్డు గ్రహీత కాశపోగు జాన్‌కు ఘన సన్మానం



(మెట్రో ఉదయం) నవంబర్ 05: సంగారెడ్డి
దళిత జర్నలిస్టుల ఫోరం (డీజేఎఫ్) సంగారెడ్డి జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్‌కు జాతీయ స్థాయిలో అవార్డు లభించిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా బృందం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. జర్నలిజం రంగంలో, దళిత జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కాశపోగు జాన్ చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఫోరం బలోపేతం, జిల్లా స్థాయిలో దళిత జర్నలిస్టులను ఐక్యం చేయడం, వారి సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో డీజేఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా కామగళ్ల నరేష్‌ను నియమించారు. ఫోరం అభివృద్ధికి, దళిత జర్నలిస్టుల హక్కుల సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

అనంతసాగర్‌లో నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



మెట్రో ఉదయం, సంగారెడ్డి ప్రతినిధి
సంగారెడ్డి జిల్లా అనంతసాగర్ గ్రామంలో కుమార్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ సర్పంచ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు 9500 ఇవ్వాలి

- కౌలు రైతులను ఆదుకోవాలి.
- కరువు నిధులు కేటాయించాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు.



మెట్రో ఉదయం, సంగారెడ్డి ప్రతినిధి
పత్తి క్వింటాల్ కు 9500/ రూపాయలు ఇవ్వాలని, కౌలు రైతులను తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. నేడు రైతు సంగం ఆధ్వర్యంలో సదాశివపేట్ పట్టణం రైతులతో కలిసి పత్తి చెలను పరిశీలన చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లినో కరువు ప్రభావంతోటి పత్తి పంట తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ఎకరాకు మూడు క్వింటాళ్ళ పత్తి కూడా సరిగా రావడం లేదని అన్నారు. రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి క్వింటాల్ కు 9500 ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతులు పంట రాక అప్పుల పాలవుతున్నారని అన్నారు తక్షణమే కౌలు రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాలకు కరువు నిధులను వెంటనే కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో జరిగే రైతుసంగం అఖిలభారత 36మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూషణం ఏషాబు బుచ్చయ్య శివయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు

పరిశోధనను విమర్శనాత్మక మూల్యాంకనంతో నిర్ణయిస్తారు

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న ఐసర్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిలోస్ కోషి.



పఠాన్ చెరు, నవంబర్5, మెట్రో ఉదయం
సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం, రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ యూనివర్సిటీ ఒక పరిశోధన యొక్క శాస్త్రీయ స్వభావం కేవలం దాని విషయ వస్తువు ద్వారానే కాకుండా, దాని పరిశోధన, పరీక్ష, విమర్శనాత్మక మూల్యాంకనం, జ్ఞానాన్వేషణ పద్ధతుల ద్వారా నిర్ణయిస్తారని ఐఐఎస్ఈఆర్ (ఐసర్) మొహాలీ, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం, తత్వశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిలోస్ కోషి అన్నారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కు చెందిన అనువర్తిత మనస్తత్వశాస్త్రం (అప్లైడ్ సైకాలజీ) విభాగం 'విజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయంగా మార్చేది ఏమిటి? మారుతున్న పద్ధతులు, వాస్తవికత భావనలు' అనే అంశంపై గురువారం ఆతిథ్య ఉపన్యాసం నిర్వహించింది. తత్వశాస్త్రం, తర్కం, శాస్త్రీయ పరిశోధన, మనస్తత్వ శాస్త్రంపై ఒక అంతర్ విభాగ దృక్పథాన్ని అందిస్తూ, డాక్టర్ కోషి శాస్త్రీయ తార్కికత యొక్క పునాదులను, శాస్త్రీయ పద్ధతుల యొక్క పరిణామ స్వభావాన్ని అన్వేషించారు. ఆయన పరికల్పనా-అవరోహణ నమూనా, కార్ల్ పాపర్ యొక్క మిథ్యావాద సిద్ధాంతం, డ్యూహెమ్-క్వైన్ సిద్ధాంతం, థామస్ కూన్ యొక్క శాస్త్రీయ మార్పు సిద్ధాంతంతో సహా కీలకమైన తాత్విక చట్రాలను చర్చించారు. ఈ సమావేశం శాస్త్రీయ హేతుబద్ధత, పరికల్పన పరీక్ష, నిర్ధారణ, మిథ్యావాదయోగ్యత, శాస్త్రీయ సిద్ధాంతాలను మూల్యాంకనం చేయడంలో ఎదురయ్యే సవాళ్లపై విలువైన అంతర్దృష్టులను అందించింది. శాస్త్రీయ జ్ఞానం ఎలా అభివృద్ధి చెందుతుంది, వాస్తవికత గురించిన భావనలు ఎలా పరిణామం చెందుతాయి అనే దానిపై విమర్శనాత్మకంగా ఆలోచించమని ఇందులో పాల్గొన్నవారిని ప్రోత్సహించింది. ఈ కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ అధ్యక్షత వహించారు. ఆమె సభికులకు స్వాగతం పలికి, తన ప్రారంభోపన్యాసంతో కార్యక్రమ నేపథ్యాన్ని వివరించారు. తన ముగింపు ప్రసంగంలో, డాక్టర్ కోషి పంచుకున్న లోతైన జ్ఞానాన్ని ఆమె ప్రశంసించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నవ్య వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ సమావేశం, విజ్ఞానశాస్త్ర తత్వశాస్త్రం, ఆచరణపై విభిన్న రంగాల మధ్య సంభాషణను ప్రోత్సహించడానికి, విమర్శనాత్మక దృక్పథాలను బలోపేతం చేయడానికి ఒక అర్థవంతమైన విద్యా వేదికగా ఉపయోగపడింది.

ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ అనేది సహజం

- హోంగార్డుగా సుగుణమ్మ పోలీసు శాఖకు అందించిన సేవలు అభినందనీయం.
- పదవీ విరమణ పొందుతున్న సుగుణమ్మను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.



మెట్రో ఉదయం,సంగారెడ్డి ప్రతినిధి
05.11.2026 నాటికి 60 సంవత్సరాల వయోపరిమితి పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న హోంగార్డ్ సుగుణమ్మను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ అనేది సహజమని, ఉద్యోగ కాలంలో అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని అన్నారు. సుగుణమ్మ గత 30 సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీసు శాఖ తరఫున సుగుణమ్మకు, ఆమె కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐలు డానియెల్, సురేష్ నాయక్, పదవీ విరమణ పొందుతున్న సుగుణమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు: కాట శ్రీనివాస్ గౌడ్



పటాన్ చెరువు, నవంబర్ 5, మెట్రో ఉదయం
సంగారెడ్డి జిల్లా, పటాన్ చేరు నియోజకవర్గం,గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో గడ్డపోతారం గ్రామంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ పనులను అధికారులు నిలిపివేయడంపై కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులు, ఆలయ నిర్వాహకులతో మాట్లాడి సమస్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, గ్రామానికి అంతటికీ ఉపయోగపడే విధంగా గుడి నిర్మాణం జరుగుతుంటే పనులను నిలిపివేయడం ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. గతంలో గ్రామ పంచాయతీ ఆమోదించిన తీర్మానాలు, అనుమతి పత్రాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, అధికారులు అనవసరంగా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇటువంటి చర్యల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, తక్షణమే గుడి నిర్మాణ పనులను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.దయం సంగారెడ్డి జిల్లా, పఠాన్ చెరువు నియోజకవర్గం, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో గడ్డపోతారం గ్రామంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ పనులను అధికారులు నిలిపివేయడంపై కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులు, ఆలయ నిర్వాహకులతో మాట్లాడి సమస్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడిన కాటా శ్రీనివాస్ గౌడ్, గ్రామానికి అంతటికీ ఉపయోగపడే విధంగా గుడి నిర్మాణం జరుగుతుంటే పనులను నిలిపివేయడం ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. గతంలో గ్రామ పంచాయతీ ఆమోదించిన తీర్మానాలు, అనుమతి పత్రాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, అధికారులు అనవసరంగా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇటువంటి చర్యల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, తక్షణమే గుడి నిర్మాణ పనులను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి..

- విద్యార్థి నాయకురాలు ఆస్మా డిమాండ్..



నాచారం, నవంబర్ 5 (మెట్రో ఉదయం):
రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ నాయకురాలు ఆస్మా ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరుద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ఆస్మాతో పాటు మూర్తి, రాజేష్ లు మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని ఆస్మా మండిపడ్డారు. మెగా డీఎస్సీ, డిగ్రీ లెక్చరర్, గురుకుల, అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. టెట్ దరఖాస్తులకు రూ.వెయ్యి ఫీజు వసూలు చేయడం.. కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలకు విరుద్ధమన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి, జాబ్ క్యాలెండర్ అమలు చేసిన తర్వాతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 30 లక్షల మంది నిరుద్యోగుల సత్తా ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు.

అమనగల్ సింగిల్ విండో చైర్మన్‌గా గూడూరు శ్రీనివాస్ రెడ్డి నియామకం

- కడ్తాల్ గ్రామంలో టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకునే కార్యకర్తలు



మెట్రో ఉదయం ఆమనగల్ ప్రతినిధి రమేష్ నవంబర్5:
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం అమనగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్ విండో చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోతుగంటి శంకర్ మరియు పట్టణ అధ్యక్షులు మాలే మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ గూడూరు శ్రీనివాస్ రెడ్డి విద్యార్థి దశ నుంచే రాజకీయాల పట్ల ఆసక్తితో యూత్ కాంగ్రెస్ నాయకుడిగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ప్రజా జీవితాన్ని ప్రారంభించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ, అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీకి అండగా నిలుస్తూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి చేసి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అదేవిధంగా కడ్తాల్ గ్రామానికి వార్డు సభ్యుడిగా, ఉపసర్పంచ్‌గా, ఎంపీటీసీగా వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రజలకు విశేష సేవలందించారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో అధికార పార్టీలో కొనసాగుతున్నప్పటికీ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తన వంతు కృషి చేశారని తెలిపారు. కడ్తాల్ గ్రామాన్ని రంగారెడ్డి జిల్లాలో కలిపే విషయంలో, అలాగే కడ్తాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయించడంలో తనకున్న పరిచయాలు, రాజకీయ అనుభవంతో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఎల్లప్పుడూ బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే నాయకుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి అని కొనియాడారు. ప్రజా సమస్యలపై లోతైన అవగాహనతో పాటు సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయనకు సింగిల్ విండో చైర్మన్ బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని తెలిపారు. ఈ నియామకంతో రైతులకు, సహకార సంఘ సభ్యులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సంక్షేమం, సహకార రంగ అభివృద్ధికి గూడూరు శ్రీనివాస్ రెడ్డి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన గూడూరు శ్రీనివాస్ రెడ్డికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, పట్టణ ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, ఎండోమెంట్ డైరెక్టర్ యాదయ్య, వార్డు సభ్యులు మల్లయ్య, మంకి మహేష్, ముత్తి కృష్ణ, జాంగిర్ బాబా, కర్రోల రమేష్ కృష్ణవేణి, రాజు గౌడ్, జగన్ గౌడ్, మోతిలాల్, శివ నాయకులు గురిగళ్ళ లక్ష్మయ్య, ఎస్సి సెల్ రామకృష్ణ, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ మరియు నాయకులు మంకీ శ్రీను, బుచ్చయ్య, ఎర్రోళ్ల శ్రీకాంత్, భరత్ యాదవ్, సత్యం, సాయిలు, రమేష్, రామకృష్ణ, శ్రీకాంత్, గంజి చంద్రశేఖర్, మహేష్, నరేష్, బాబు, సేవ్య మరియు తదితరులు ఉన్నారు.

ట్రంప్ ఓటమితో స్టాక్‌మార్కెట్లకు జోష్.. సెన్సెక్స్ 2,100 పాయింట్లు జంప్..!



నవంబర్ 5 (మెట్రో ఉదయం):
దేశీయ స్టాక్ మార్కెట్లలో గురవారం లాభాల జోరు కొనసాగుతున్నది. అమెరికా ఎన్నికల ఫలితాలు, అంతర్జాతీయ పరిణామాలతో వరుసగా ఆరోరోజు కూడా సూచీలు లాభాల్లో దూసుకెళ్తున్నాయి. ముఖ్యంగా ముడిచమురు ధరల పతనం మార్కెట్లకు మరింత ఉత్సాహాన్నిస్తున్నది. దాంతో గురువారం నాటి ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 2100 పాయింట్లకుపైగా ఎగబాకింది. నిఫ్టీ 24,500 మార్క్ పైన కదలాడుతున్నది. మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో సెన్సెక్స్ 2,124 పాయింట్లు పెరిగి 79,426 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 578 పాయింట్ల లాభంతో 24,538 వద్ద కొనసాగుతోంది. ఫార్మా మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ఉన్నాయి. ఆటోమొబైల్ రంగ సూచీ 2.5 శాతం ఎగబాకింది. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, మారుతి సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రాణిస్తున్నాయి. రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా, కోల్ ఇండియా, ఎయిర్‌టెల్ స్వల్ప నష్టాల్లో ఉన్నాయి. అమెరికాలో మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలతో వాల్‌స్ట్రీట్ దూసుకెళ్లింది. డోజోన్స్ ఏకంగా 1500 పాయింట్లకుపైగా పెరుగగా ఎస్ అండ్ పీ 500 సూచీ 1.58 శాతం, నాస్‌డాక్ 1.44 శాతం ఎగబాకాయి. ఈ పరిణామాలు మన మార్కెట్లకు కలిసొచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గొచ్చనే అంచనాలతో చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 93.5 డాలర్ల వద్ద రెండు నెలల కనిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలపడింది. నేటి ట్రేడింగ్‌లో 14 పైసలు పెరిగి 94.32 వద్ద కొనసాగుతోంది. వరుసగా నాలుగో రోజు విదేశీ సంస్థాగత మదుపర్ల నుంచి మన మార్కెట్లకు పెట్టుబడులు కొనసాగాయి. బుధవారం ఒక్కరోజే రూ.7284 కోట్ల విలువైన ఈక్విటీలను వారు కొనుగోలు చేశారు. ఒక్క రోజులో ఈ స్థాయిలో కొనుగోళ్లు జరగడం 2025 అక్టోబర్ తర్వాత ఇదే తొలిసారి.

ఉదయం కవితోదయం

సాహితీ కనం

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల పాలిట శాపం " టెట్"

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

మన దేశంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల పాలిట శాపం గా "టెట్ " మారింది.విద్యాహక్కు చట్టం 2009 (ఆఱ్ఱూఱు 2009) కంటే ముందు ఉద్యోగం లో చేరిన ఉపాధ్యాయులకు టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) తప్పకుండా ఉత్తీర్ణత సాధించాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.ఏ చట్టం అయిన ప్రభుత్వ ఉత్తర్వులు అయిన వచ్చిన తేదీ నుంచి ఆ తర్వాత అమలు లోకి వస్తాయి.కాని టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) మాత్రం ప్రభుత్వ, పంచాయతీ రాజ్, స్థానిక సంస్థలు, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యూకేషనల్ ఇనిస్టిట్యూట్ (ఎ+ఆఱ్ఱూఱా) గురుకులాలు, మోడల్ స్కూల్,ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధించే ప్రతి ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సెట్ (సెంట్రల్ టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్) లేదా టెట్ (టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్) రెండు సంవత్సరాల లోపు ఉత్తీర్ణత సాధించాలని లేకపోతే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వస్తుందని మన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఖరాఖండిగా చెప్పడం తో ఇన్ సర్వీస్ టీచర్స్ కు టెట్ ఉత్తీర్ణత సాధించడం కంపల్సరీ అయ్యింది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, అనేక ఉపాధ్యాయ సంఘాలు సుప్రీం కోర్టు లో రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తే ఇన్ సర్వీస్ టీచర్స్ కు టెట్ ఉత్తీర్ణత సాధించడానికి రెండు సంవత్సరాలకు ఇంకో సంవత్సరం కలిపి మూడు సంవత్సరాల లోపు అనగా 31 ఆగష్టు 2028 లోపు ప్రతి ఒక్క ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ లో ఉత్తీర్ణత సాధించడం అనేది కంపల్సరీ అయ్యింది.
మనదేశంలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం లో టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) ప్రభుత్వ ఉపాధ్యాయులుగా చేరడానికి ప్రాథమిక పాఠశాల ఒకటి నుండి ఐదో తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులుగా నియమితులు కావడానికి పేపర్ 1, ఉన్నత పాఠశాలలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు బోధించడానికి నియమితులు కావడానికి పేపర్ 2 ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రభుత్వ, పంచాయతీ రాజ్ మిగతా ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరడానికి డి.ఎస్సీ పరీక్ష రాయడానికి అర్హత సాధించడం జరుగుతుంది.నిరుద్యోగులకు నిర్వహించే టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) రాయడానికి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించారు.అనేక మంది ఇన్ సర్వీస్ టీచర్స్ టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత సాధించకపోవడం వల్ల టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) ఇన్ సర్వీస్ టీచర్స్ కు రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు చేశారు.కొన్ని వేల మందితో మన దేశ రాజధాని ఢిల్లీలో ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు.అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘాల కతీతంగా పాల్గొని టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) రద్దు చేయాల్సిందేనని ముక్తకంఠంతో నినదించారు.కేంద్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్సీఆర్టీ) టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) నిర్వహించుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది.మన తెలంగాణ రాష్ట్రం లో ఇన్ సర్వీస్ టీచర్స్ కు ప్రతి సంవత్సరం రెండు సార్లు టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) నిర్వహించడానికి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.2026 జనవరి లో మొదటి సారి ఇన్ సర్వీస్ టీచర్స్ కు ప్రత్యేక టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) నిర్వహించింది. నవంబర్ 16 నుండి నవంబర్ 21 వరకు టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) రెండో సారి రాయడానికి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించింది.తెలంగాణ రాష్ట్రం లోని 33 జిల్లాలలో ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ఇంకా ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) రాయడానికి 9262 మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉంటే దాదాపు 40 వేలకు పైగా టెట్ ఉత్తీర్ణత సాధించారు.మిగితా ఇన్ సర్వీస్ టీచర్స్ టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత సాధించడానికి నవంబర్ 5 నుండి 10 వ తేదీ వరకు మాకు టెస్ట్ లను నిర్వహించి కంప్యూటర్,కీ బోర్డు, మౌస్, మానిటర్ పై అవగాహన కలిగిస్తున్నారు.టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్) ఈ దఫా కూడా కంప్యూటర్ బెస్డ్ టెస్ట్ (జదీ) ద్వారా నిర్వహించనున్నారు.

ఇన్ సర్వీస్ టీచర్స్ కు టెట్ తో ఇబ్బందులు:-ఇన్ సర్వీస్ టీచర్స్ టెట్ తో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.1996 లో ఉద్యోగం లో చేరిన వారు 30 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత ఇప్పుడు టీచర్స్ గా ఎలిజిబుల్ ఉన్నారో లేదో పరీక్ష ద్వారా నిరూపించాలనడం ఆశ్చర్యం గా, విచిత్రం గా విడ్డూరం గా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తమ దగ్గర చదువు కున్న విద్యార్థులు డాక్టర్ లుగా, ఇంజనీర్లు గా, న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా, శాస్త్ర సాంకేతిక నిపుణులు గా, పోలీస్ అధికారులుగా,ఉన్నతోన్నత ఉద్యోగులుగా చేస్తున్నారని తెలిపారు. 30 సంవత్సరాల సర్వీసు తర్వాత ఇప్పుడు టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ రాయాలంటే కంటి సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నామని ఇప్పుడు మేము బోధించే అంశాలకు సంబంధించని విషయం లో టెట్ పరీక్ష ను నిర్వహించి సమాజం లో ఉపాధ్యాయుల పట్ల చిన్నచూపు చూసేటట్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భాష పండితులకు భాషల్లో టెట్ పరీక్ష ను నిర్వహించి ఎలిజిబుల్ చూడాలని కానీ భాష పండితులకు ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రం,మానసిక శాస్త్రంలో పరీక్ష ను నిర్వహించి, బయోలజీ టీచర్స్ కు సంబంధం లేని మానసిక శాస్త్రం, భౌతిక శాస్త్రం, గణితం, ఇంగ్లీష్ లో ఎలిజిబుల్ టెస్ట్ నిర్వహించి పరీక్ష తప్పిన ఉపాధ్యాయులు అంటూ పతాక శీర్షికలను పత్రికలలో పెట్టి పరువు తీస్తున్నారు.ఏ సబ్జెక్టు వాళ్ళకు ఆ సబ్జెక్టు లో పరీక్ష నిర్వహించి ఎలిజిబుల్ గురించి అడిగితే బాగుంటుందని అంటున్నారు.ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 60 మార్కులు,బి.సి.లకు 75 మార్కులు,ఓ.సి లకు 90 మార్కులు రావాలి అనే నిబంధనలు పెట్టారని ఏ పరీక్ష లోను ఇలాంటి వ్యత్యాసం లేదని ఒకటి, రెండు మార్కులతో ఉత్తీర్ణత సాధించడం లేదని అర్హత మార్కులు అందరికీ సమానంగా పెట్టాలని కోరితే చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు ఎవరు పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మన పొరుగు రాష్ట్రము లో రెండు మోడల్ పేపర్ లను విడుదల చేసి అందులో నుండి పరీక్ష ను నిర్వహించి ఉత్తీర్ణత సాధించేటట్లు చేసి అందరూ టెట్ ఉత్తీర్ణత సాధించేటట్లు చూశారని తెలంగాణ రాష్ట్రం లో మాక్ టెస్ట్ లను నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటో అర్థం కావడం లేదని అంటున్నారు.కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ టెట్ ఉత్తీర్ణత మార్కులను తగ్గించి ఉపాధ్యాయులు అందరూ అర్హత సాధించేటట్లు చేశారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ టెట్ వారి వారి సబ్జెక్టు లలో పరీక్ష నిర్వహించాలని లేదా మిగితా రాష్ట్రాల మాదిరిగా అర్హత మార్కులు తగ్గించాలని అనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగం ఉంటుందో టెట్ ఉత్తీర్ణత కాకుంటే ఉద్యోగం పోతుందో ననే మానసిక ఒత్తిడి కి గురౌతున్నారు.

ఉపాధ్యాయులకేనా అర్హత పరీక్ష:-

మన దేశంలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం లో అనేక డిపార్ట్మెంట్ లు ఉన్నాయని డాక్టర్ అర్హత పరీక్ష, పోలీస్ అర్హత పరీక్ష, ఇంజినీర్ అర్హత పరీక్ష, న్యాయవాద అర్హత పరీక్ష నిర్వహిస్తే చాలా మంది ఉత్తీర్ణత సాధించరని కేవలం ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష టెట్ నిర్వహించి ఉపాధ్యాయులు పరీక్ష తప్పారని అనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ సంబంధిత అధికారులు టీచర్స్ ఇబ్బందులను మానవత్వ దృష్టి తో ఆలోచించి టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ టెట్ అర్హత మార్కులు తగ్గించాలని కోరుతున్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యా శాఖ స్వయంగా పర్యవేక్షించడంతో ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి ని దూరం చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



డాక్టర్. ఎస్. విజయ భాస్కర్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి.ఆర్.టి.ఎఫ్), హైదరాబాద్ జిల్లా.

సంస్కృతం దేవనాగరలిపి, భాష!అనుష్టుప్ఛందస్సు



సముద్రం సర్వ నదీనాం అన్నట్లుగా సంస్కృత భాష ఈ విశ్వంలో గల భాషలన్నిటికీ మూలం తల్లి భాష! అందుకే దీనిని దేవనాగరలిపి భాష అంటారు! నేటి ఆధునిక శాస్త్రీయ సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న నవీన యుగంలో కూడా కంప్యూటర్ కి అనువైన భాషగా గుర్తించడం చాలావిశేషమైనది!

తెలుగు భాషకు ఛందస్సు అంటే యతి ప్రాస లతో చందోబద్దం గా గల కొన్ని వృత్తాలు పద్య లక్షణాలు!

సంస్కృత భాషలో అత్యధికంగా ఉపయోగించ బడిన అనుష్టుప్ ఛందస్సు అనేది భారతీయ కావ్యాలలో, ముఖ్యంగా రామాయణం, మహాభారతం, మరియు భగవద్గీత వంటి పురాణేతి హాసాలలో ఒక ప్రసిద్ధ సంస్కృత ఛందోరీతి! మనకు లభించే చాలా శ్లోకాలు ఈఛందస్సులోనేఉంటాయి.

దీని ప్రధాన లక్షణాలు నియమాలు :
ప్రతి శ్లోకంలో 4 పాదాలు ఉంటాయి, ప్రతి పాదానికి సరిగ్గా 8 అక్షరాలు (మొత్తం శ్లోకానికి 4 ఐ 8 = 32 అక్షరాలు) ఉంటాయి.నాలుగు పాదాలు: ఈ శ్లోకంలో మొత్తం నాలుగు పాదాలు (లైన్లు) ఉంటాయి.అక్షరాల సంఖ్య: ప్రతి పాదంలో ఖచ్చితంగా 8 అక్షరాలు ఉంటాయి. మొత్తం శ్లోకంలో 32 అక్షరాలు ఉంటాయి!

శ్రీ లలితా సహస్రనామ,శ్రీ విష్ణు సహస్రనామ,శ్రీ రామ రక్షా స్తోత్రం, భగవద్గీత (ఎక్కువ శ్లోకాలు)
ఈ అనుష్టుప్ ఛందస్సు లోనే ఉంటాయి.

శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ
శ్రీమత్సింహాసనేశ్వరీ ।
చిదగ్నికుండ సంభూతా
దేవకార్య సముద్యతాశ్రీశ్రీ

శ్రీరామ రామ రామేతి
రమే రామే మనోరమేశ్రీ
సహస్ర నామ తత్ తుల్యం
రామ నామం వరాననేశ్రీశ్రీ

పై 2 శ్లోకాల్లో ప్రతి వరుసకి 8 అక్షరాలు వున్నాయి.

1వ పాదం: శ్రీ-మా-తా-శ్రీ-మ-హా-రా-జ్ఞ.8 అక్షరాలు.
1 వ పాదం:శ్రీ-రా-మ-రా-మ-రా-మే-తి..8అక్షరాలు.

ఇది యే ప్రపంచం మెచ్చుకొనే సంస్కృత భాష యొక్క విశేషమైన ప్రాశస్తయ్యం. విశ్వ జనీయం!

విశ్వభాషలకు మూలం సంస్కృత భాషయే నమః



డాక్టర్ ప్రాత రాజశేఖర్, ప్రభుత్వ విశ్రాంత గురుకుల ఉపాధ్యాయులు, చోడవరం

అమ్మనుడి అమృత ఝరి.

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

కన్నతల్లి ఒడిలోన నేర్చిన పలకరింపు,
అమ్మ పెదవుల నుండి జారిన అమృతపు పిలుపు.
ఎన్ని భాషలు నేర్చినా ఎదకు దొరకని హాయి,
సొంత భాషలో పలికితే గుండె నిండుగా శోభాయి.
అక్షరాల వెనుక దాగున్న అనుబంధాల తీపి,
మాట మాటలో పొంగే స్వచ్ఛమైన భావాల దీప్తి.
పరభాషల జ్ఞానమెంత ఉన్నా తలవంచే రీతి,



మాతృభాషపైనే సాగును వ ం ని ష ి
ఆత్మజ్యోతి.
హృదయాలను ముడివేసేది మన అమ్మ నుడి,
సంస్కృతిని నిలిపేటి పవిత్రమైన గుడి.
భాషలన్నిటిలోన మమతను నింపే శక్తి,
సొంత భాషను గౌరవించడమే నిజమైన భక్తి.
ఎవరి భాష వారికి ఎంతో ముద్దు,
దాన్ని మరువమని ఏ శాస్త్రం చెప్పొద్దు.
తేనె లొలికే తెలుగు మాటల తీపి,
జగతిలోన చాటుదాం మన భాషా ఖ్యాతి.



సమ్మెట వెంకటేశ్వర్లు.
అక్షరమిత్ర, స్వర్ణనంది అవార్డు గ్రహీత,
మహబూబాబాద్,
9440413963.

కుక్కతోక వంకర

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

కుక్క తోకను ఎంత నిటారుగా
చేయాలని చూసినా వంకర పోదు...
అలాగే కొంతమంది మనుషులకు
నువ్వు ఎంత మంచి చేసినా వారి
చెడు బుద్ధి మారదు!
అందరినీ మార్చాలని ఆశపడకు...
మనసు మంచిదైతే మాటలో మాధుర్యం ఉంటుంది,
మంచితనం ఉంటే మనిషిలో మానవత్వం ఉంటుంది,
ఎంత ప్రేమ చూపించినా కొందరు మారరు,
ఎన్ని సహాయాలు చేసినా కృతజ్ఞత తెలియదు,
నీ మంచితనాన్ని బలహీనతగా భావిస్తారు,
నీ మౌనాన్ని చేతకానితనంగా చూస్తారు,
నీ ఓర్పును అలుసుగా తీసుకుంటారు,
నీ ప్రేమను స్వార్థానికి వాడుకుంటారు,
అలాంటి వారి కోసం నీ మనసును బాధించుకోకు,
నీ విలువను నువ్వే తగ్గించుకోకు,
ప్రతి ఒక్కరికి నచ్చాలని ప్రయత్నించకు,
ప్రతి మనసును గెలవాలని ఆశించకు,
నిజాయితీగా ఉండటం నీ బాధ్యత,
నిన్ను అర్థం చేసుకోవడం వారి అదృష్టం,
మంచి చేయడం నీ స్వభావం,
దాన్ని గుర్తించడం వారి సంస్కారం,
ఎవరెంత మారినా వారి స్వభావం మారదు,
ఎన్ని మాటలు చెప్పినా వారి ఆలోచన మారదు,
అందుకే నీ సమయాన్ని వృథా చేయకు,
నీ ప్రశాంతతను పణంగా పెట్టకు,
నీ గౌరవాన్ని నువ్వే కాపాడుకో,
నీ ఆత్మాభిమానాన్ని నిలబెట్టుకో,
దూరంగా ఉండాల్సిన వారిని దూరంగా ఉంచు,
అవసరమైన చోట మౌనంగా తప్పుకో,
నీ జీవితాన్ని నీకోసం జీవించు,
నీ ఆనందాన్ని నువ్వే వెతుక్కో,
మంచి మనసులకు మాత్రమే విలువ ఇవ్వు,
నిన్ను గౌరవించే వారిని ప్రేమించు,
నిన్ను బాధించే వారిని వదిలేయడం నేర్చుకో,
ఎందుకంటే అందరినీ మార్చలేవు...
కానీ నీ జీవితాన్ని అందంగా మార్చుకోగలవు!



రచన : అందే శ్రీనివాసులు,
సామాజికవేత్త, నెల్లూరు.

కాలమే విలువైన నాణెం

9581419999
ఉదయం
WWW.METROUDYAM.COM

జీవితం విలువైన నాణెం లాంటిది,
ఒక వైపు బొమ్మ, మరో వైపు బొరుసు,
బొమ్మపడితే భవిష్యత్తు కోసం పరుగులు,
బొరుసుపడితే బాధ్యతల కోసం పోరాటాలు,
రెండు వైపులా మన శ్రమే ముద్రగా మారుతుంది,
రెండు వైపులా మన చెమటే విలువను పెంచుతుంది,
కానీ ఆ నాణెం నిజమైన ధర డబ్బులో లేదు,
దాని అసలు విలువ కాలం అనే ఖజానాలో ఉంది,
కరెన్సీ పోతే మళ్లీ సంపాదించవచ్చు,
కాలం పోతే తిరిగి కొనలేం,
ధనం ఖర్చు చేస్తే ఖాళీ జేబు మిగులుతుంది,
కాలం ఖర్చు చేస్తే జ్ఞాపకాలు మాత్రమే మిగులుతాయి,
బ్యాంకులో డబ్బును దాచుకోవచ్చు,
జీవితంలో గడిచిన క్షణాలను దాచలేం,
భవిష్యత్తు కోసం వర్తమానాన్ని తాకట్టు పెట్టొద్దు,
బాధ్యతల కోసం ఆనందాన్ని పూర్తిగా మరిచిపోవద్దు,
ఎందుకంటే రేపటి ఆశలో
నేటి శ్వాసను కోల్పోవద్దు,
నాణెం రెండు వైపులా సమతుల్యంగా ఉండాలి,
అలాగే జీవితం కూడా సమతుల్యంగా సాగాలి,
సంపాదనకు సమయం ఇవ్వాలి,
సంబంధాలకు కూడా సమయం ఇవ్వాలి,
కలల కోసం కష్టపడాలి,
మనసు కోసం కాసేపైనా ఆగాలి,
కాలం అనే నాణెం చేతిలో ఉన్నంతవరకు,
దాన్ని ఎక్కడ ఖర్చు చేస్తున్నామో ఆలోచించాలి,
ఎందుకంటే ప్రతి క్షణం తిరిగి రాని పెట్టుబడి,
ప్రతి నిమిషం జీవితపు ఖాతాలో చివరి నిల్వ,
చివరికి మన వెంట వచ్చేది సంపద కాదు,
మనం జీవించిన క్షణాల పరిమళమే,
అందుకే కాలాన్ని గౌరవించి జీవితాన్ని విలువైనదిగా జీవించాలి.



రచన :
కె.మురళీమోహన్ రాజు,
నెల్లూరు. చరవాణి :
9866179385

మెట్రో ఉదయం
జాతీయ తెలుగు దిన పత్రిక
శుక్రవారం
06.11.2026

సూర్యతో మూడు సినిమాలు మిస్..

ఇంతకీ నజ్రియా నజీమ్ ఏం చెప్పిందంటే..?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న ప్రాజెక్ట్ 'సీన్'. 'ఆవేశం' ఫేం జీతూ మాధవన్ డైరెక్టర్‌గా కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా నవంబర్ 6న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు.కాగా ప్రమోషనల్ ఈవెంట్‌లో నజ్రియా నజీమ్ ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది. ఈ భామ ఇప్పటికే సూర్యతో మూడు సినిమాలు చేయాల్సి ఉండగా.. చేయలేదట. మరి సూర్య సినిమాలకు నో చెప్పిందా అంటే.. అదేమి కాదని చెప్పింది.. కేరళ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. తాను సూర్య సినిమాలను తిరస్కరించలేదని క్లారిటీ ఇచ్చింది. డేట్ల సర్దుబాటు, ఇతర షెడ్యూల్ చిక్కుల కారణంగా సూర్య చేసిన సినిమాల్లో నటించలేకపోయానని చెప్పింది.అంతేకాదు తమిళ సినిమాలో మళ్లీ నటించేందుకు 12 ఏండ్లు ఎందుకు పట్టిందనే విషయంపై కూడా వివరణ ఇచ్చింది. తమిళ సినిమాలో కమ్ బ్యాక్ ఎంట్రీ ఇచ్చేందుకు సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూశానని.. మళ్లీ ఇన్నాళ్లకు సీన్ సినిమాతో వర్కవుట్ అయిందని చెప్పింది. మలయాళ దర్శకుడు జీతూ మాధవన్‌తో తమిళంలో సినిమా చేస్తున్న తొలి హీరోయిన్ తానే అవడం హ్యాపీగా ఉందంది. మొత్తానికి నజ్రియా నజీమ్ అలా సూర్యతో రొమాన్స్ చేసే అవకాశం వచ్చినట్టే వచ్చి మిస్ అయిందన్నమాట.

సైఫ్‌పై కత్తితో దాడి..

ఆ రాత్రి పిచ్చిదానిలా రోడ్డుపై పరిగెత్తా: కరీనా కపూర్



బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడికి సంబంధించి ఆయన సతీమణి, ప్రముఖ నటి కరీనా కపూర్ ఖాన్ షాకింగ్ విషయాలు వెల్లడించారు. గతంలో సైఫ్ నివాసంలో జరిగిన ఈ దుర్ఘటన బాలీవుడ్‌ను ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురిచేసిన విషయం తెలిసిందే. దాడి జరిగిన ఆ తెల్లవారుజామున అసలేం జరిగిందో కరీనా కపూర్ వివరిస్తూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ రాత్రి తాను వేసుకున్న నైట్ టీషర్ట్‌తోనే ఎలాంటి హంగులూ లేకుండా రోడ్డుపైకి పరిగెత్తి సహాయం కోసం అరిచానని తెలిపారు. రక్తంతో తడిసిముద్దయిన సైఫ్‌ను కాపాడుకునేందుకు దారిలో వెళ్లే వాహనాలను ఆపుతూ గట్టిగా కేకలు వేశానని చెప్పారు. ఈ భయానక దృశ్యం ఒక సినిమాను తలపించిందని, ఆ సమయంలో తనను ఎవరూ వీడియో తీయకపోవడం అదృష్టమని ఆమె పేర్కొన్నారు.ఇదే సందర్భంలో సైఫ్ అలీఖాన్ మాట్లాడుతూ.. తనపై దుండగుడు దాదాపు పదిసార్లు కత్తితో దాడి చేశాడని తెలిపారు. తన కుమారుడు తైమూర్ భయపడిపోయి, "నాన్నా.. నువ్వు చనిపోతావా?" అని అడిగిన క్షణాలు తనను ఎంతగానో కలచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆ దుండగుడు ఉపయోగించిన కత్తి నాసిరకం కావడంతోనే తాను ప్రాణాలతో బయటపడగలిగానని, లేదంటే పరిస్థితి మరోలా ఉండేదని ఆయన తెలిపారు. దాడి జరిగిన రోజు రాత్రి ఇంట్లో డ్రైవర్లు ఎవరూ లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేర్చడంలో మరింత ఇబ్బంది అయిందని వెల్లడించారు.ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సమయంలో తాను చాలా ప్రశాంతంగా కనిపించడంతో సోషల్ మీడియాలో రకరకాల వదంతులు వచ్చాయని, అసలు దాడి జరిగిందా లేదా అని కొందరు అనుమానాలు వ్యక్తం చేశారని సైఫ్ గుర్తుచేశారు. బయటకు తాము ధైర్యంగా కనిపిస్తున్నప్పటికీ, ఆ ఘటన తమ కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపిందని కరీనా తెలిపారు. ఆ భయానక అనుభవం కారణంగా దాదాపు ఆరు నెలల పాటు తమకు సరిగ్గా నిద్రపట్టలేదని ఆవేదన వెలిబుచ్చారు.

'రామాయణ' అద్భుతంగా ఉంది..

ఎస్.ఎస్.రాజమౌళి ప్రశంసల వర్షం!

భారతీయ సినీ పరిశ్రమ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన 'రామాయణ: పార్ట్ 1' (ఇంఇఇఅ: ఖీఖితీ 1) చిత్రం భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చి సంచలనం సృష్టిస్తోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, కన్నడ సూపర్‌స్టార్ యశ్ రావణాసురుడిగా, టాలీవుడ్ నటి సాయిపల్లవి సీతాదేవిగా నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సినిమాను తాజాగా వీక్షించిన ప్రముఖ టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి (ఖూ ఇంఖిఎశీబశ్రీఅ) సోషల్ మీడియా వేదికగా సినిమాపై ప్రశంసల జల్లు కురిపించారు.ఈ చిత్రం గురించి రాజమౌళి ప్రత్యేకంగా స్పందిస్తూ.. "రామాయణ సినిమా రూపకల్పన, పెద్ద తెరపై కనిపించే విజువల్స్ అద్భుతంగా, కంటికింపుగా ఉన్నాయి. ముఖ్యంగా వనవాసం ఘట్టం నుంచి రాముడిగా రణ్‌బీర్ కపూర్ ప్రశాంతమైన లుక్‌తో పాటు ఎంతో గంభీరంగా కనిపించారు. ఇక రావణాసురుడి పాత్రలో యశ్ నటన ఎంతో భయానకంగా, పవర్‌ఫుల్‌గా ఉంది. సీతాదేవిగా సాయిపల్లవి తనదైన అభినయంతో చాలా హుందాగా నటించారు. సినిమాలోని ప్రీ-క్లైమాక్స్, క్లైమాక్స్ సన్నివేశాలు అయితే నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఆ ప్రతి క్షణాన్ని నేను పూర్తిగా ఆస్వాదించాను" అని ఆయన కొనియాడారు ఇంతటి గొప్ప విజన్‌తో తెరకెక్కించిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీతో పాటు చిత్ర బృందం మొత్తానికి జక్కన్న రాజమౌళి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం రాజమౌళి చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

చిత్రోదయం

రణ్‌బీర్-సాయిపల్లవిల 'రామాయణ -- 1' మెప్పించిందా?



భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది నితీశ్ తివారీ 'రామాయణ'. ప్రకటన వచ్చిన నాటి నుంచే ఈసినిమాపై అంచనాలు మొదలయ్యాయి. రాముడిగా రణబీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, మండోదరిగా కాజల్, కైకసిగా శోభన, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్.. ఇలా తారాగణ వివరాలు తెలియగానే ఆ అంచనాలు ఆకాశాన్నంటాయి. ప్రచార చిత్రాలు సైతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఫస్ట్ పార్ట్ ఈ దీపావళికి, నెక్స్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి అని ప్రకటించగానే, తొలిపార్ట్ కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురు చూశారు. అనుకున్నట్టే 'రామయాణ -- 1' సినిమా గురువారం థియేటర్లలోకి ఎంట్రీ ఇచ్చింది. మరి అందరి అంచనాలనూ ఈ సినిమా అందుకున్నదా? ఈ సినిమాకు ముందు బాలీవుడ్‌లోనే తెరకెక్కిన 'రామాయణ' ఇతిహాసం 'ఆది పురుష్' ఆడియన్స్‌కి, నిర్మాతలకు చేదు అనుభవాలను మిగిల్చింది. మరి నితీశ్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ 'రామాయణం' ప్రేక్షకుల ఎలాంటి అనుభూతినిచ్చింది? అనేది తెలుసుకునే ముందు కథలోకి వెళ్లాలి.

కథ

ఇది యుగయుగాలుగా భారతీయుల రక్తంలో జీర్ణించుకుపోయిన కథ. కాబట్టి రామాయణ కథ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది జగమెరిగిన కావ్యం. అయితే.. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందించారు కనుక, ఈ తొలి భాగం దశాననుడు రావణుడిగా మారిన పరిణామక్రమాన్ని, శ్రీరాముడి జన్మవృత్తాతం, తాటక వధ, శివధనుర్భగం, సీతారామలక్ష్మణ వనవాసం, కబంధనుని వధ, కరదూషణాధుల వధ, సీతాపహరణం, జటాయు మరణం ఘట్టాలతో సాగింది. జాటాయు మరణానంతరం 'రావణుడ్ని సంహరించబోతున్నాను' అంటూ రాముడు ప్రతిజ్ఞ చేయడంతో ఈ తొలి భాగం ముగిసింది. ఇక సుందరకాండ, రావణ వధ, శ్రీరామపట్టాభిషేకం తదితర అంశాలన్నీ రెండో పార్ట్‌లో ఉంటాయన్నమాట.

విశ్లేషణ

దేవదానవ సంగ్రామంలో ఓడిపోయి, రాజ్యాన్ని పోగొట్టుకొని పాతాళలోకంలో తలదాచుకున్న రాక్షస జాతికి పునరుజ్జీవాన్ని అందించేందుకు దానవరాణి కైకసి, తన తనయుడు దశాననుడిలోని పౌరషాగ్నిని రగిల్చడం, ఘోర తపస్సు చేసి, బ్రహ్మ దేవుడి వరాన్ని పొందిన దశాననుడు దానవసామ్రాట్టు రావణబ్రహ్మగా లంకా రాజ్య సింహాసన్నా అధిష్టించడంతో కథ మొదలైంది. ప్రతినాయకుడి శక్తిసామర్థ్యాలను అద్భుతంగా ఆవిష్కరించి, కథానాయకుడు సాధించబోయే కార్యం ఎంత కష్టతరమైనదో ప్రేక్షకులకు వివరించడంలో ముందు దర్శకుడు నితీశ్ తివారీ సక్సెస్ అయ్యారు. నిజానికి రావణుడి పాత్రకు ఆయనిచ్చిన ఎలివేషన్స్ రాముడికి కూడా ఇవ్వలేదు. నిజానికి రాముడికి ఎలివేషన్ అవసరం లేదు కూడా. రావణుడనేవాడు ఎంతటి మహావీరుడైనా, శక్తివంతుడైనా చివరకు వాడు పోయేది రాముడి చేతిలోనే అని ఆడియన్స్‌కి తెలుసు కాబట్టి, ఎలివేషన్స్ అవసరం లేదనుకుని ఉండొచ్చు. సాదాసీదాగా రాముడి పాత్రను కథలోకి ప్రవేశింపజేసి, నిదానంగా ఆడియన్స్‌కి 'శ్రీరాముడు' అనే వ్యాక్సిన్‌ని ఆడియన్స్‌కి ఇంజెక్ట్ చేశాడు దర్శకుడు నితీశ్. సినిమా చూడంగ చూడంగ.. రణబీర్‌లో రాముడ్ని చూడటం మొదలుపెట్టారు ఆడియన్స్. రణబీర్ కూడా అభినయం విషయంలో అద్భుతం అనిపించాడు. అయితే.. అతని ఆహార్యం బావున్నా.. నీలమేఘశ్యాముడిగా రాముడ్ని చూపించకపోవడం తెలుగువారికి మింగుడు పడదు. అందుకే.. రణబీర్‌ని రాముడిగా ఒప్పుకోవడానికి కాస్తంత టైమ్ పడుతుంది. నిజానికి 'రామాయణం'లోని బాలకాండ, అరణ్యకాండ కాస్త స్లోగా అనిపిస్తాయి. కానీ దర్శకుడు నితీశ్ తివారీ ఎక్కడా జనానికి విసుగు అనిపించకుండా, తొలి పావుగంట రావణాసుడి ఎపిసోడ్‌తో, తర్వాత తాటక వధ, కంబధ వధ, కరదూషణాదుల వధ, జటాయు మరణం.. లాంటి అద్భుతమైన యుద్ధ సన్నివేశాలను హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించి, ఎక్కడా ల్యాగ్ అనిపించకుండా ఆసక్తికరంగా, అందరికీ నచ్చేలా తీసి, సక్సెస్ అయ్యారు. అయితే.. ఇప్పటివరకూ రావణమాత కైకసి పాత్రను పాజిటీవ్‌గానే మనం చూశాం.కానీ ఈ సినిమాలో కైకసి నుంచి రావణుడ్ని విష్ణుద్వేషం మొదలైనట్టు చూపించారు. అలాగే.. శ్రీరాముడి ముందు భార్గవరాముడు మోకరిల్లడం లాంటి సీన్స్ కూడా జనానికి మింగుడు పడవు. అయితే.. మిగతా సన్నివేశాలన్నీ జనరంజకంగా తెరకెక్కించారు. మొత్తంగా తొలిభాగంతోనే దర్శకుడు నితీశ్ జనాల్లో మంచి మార్కులు సంపాదించుకున్నారు.

నటీనటులు

రాముడిగా రణబీర్ చక్కగా అభినయించాడు. పరశురాముడిగా కూడా ఓ సన్నివేశంలో కనిపించి అదరహో అనిపించుకున్నారు. ఇక సీతగా సాయిపల్లవి ఒదిగిపోయి నటించింది. ఆమె ఆహార్యం, అభినయం నిజంగా అద్భుతం. ఇందులో సీతను కూడా ఓ యోధురాలిగా చూపించి, ఓ కొత్త ప్రయోగానికి తెరలేపారు దర్శకుడు నితీశ్. రామాయణాన్ని నిశితంగా గమనించిన వారికి, అలా చూపించడం తప్పు కాదు అనిపిస్తుంది. ఎందుకంటే.. మహావీరులు, మహాబలులు సైతం ఎత్తలేని శివధనుస్సును అలవోకగా ఎత్తిన మహాబలశాలి సీతామ్మ. అలాంటి సీతమ్మ యోధురాలు ఎందుకు కాకూడదు?. మొత్తంగా సాయిపల్లవి సీతగా చాలా బాగా నటించింది. సీతాసాధ్విగా, వీరనారిగా పలు కోణాలను ఆమె పలికించిన తీరు బావుంది. లక్ష్మణుడిగా రవి దూబే కూడా బావున్నాడు. ఇక రావణుడిగా యశ్ అయితే.. విశ్వరూపం చూపించాడు. శూర్పణఖ పాత్రకు రకుల్ ప్రీత్‌సింగ్ నటన ఓ గౌరవాన్ని తెచ్చింది. మిగతా నటీనటులంతా పరిధిమేర తమ పాత్రలకు న్యాయం చేశారు.

సాంకేతికంగా

సాంకేతికంగా అన్ని విభాగాలూ బాగా పనిచేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజన్స్(ఏఐ) ఉపయోగించి డబ్బింగ్ విషయంలో, అచ్చంగా తెలుగు సినిమాను చూస్తున్న అనుభూతినే తీసుకురాగలిగారు. లిప్ సింక్ కూడా సరిగ్గా సరిపోయింది. కెమెరా పనితనం బావుంది. ఏఆర్ రెహమాన్ పాటలు, నేపథ్య సంగీతం భావగర్భితంగా, కథ స్థాయికి తగ్గట్టుగా సాగింది. యాక్షన్ అంశాలను కూడా అద్భుతంగా తెరకెక్కించారు. సీజీ వర్క్ అయితే.. నేచురల్‌గా అనిపించింది. మొత్తంగా నిర్మాత పెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. రావణాద్ని సంహరిస్తానని రాముడు చెప్పడంతో ప్రథమార్ధం ముగిసింది. సెకండ్‌పార్ట్‌లో ఆంజనేయుడు రాబోతున్నాడని హింట్ ఇస్తూ.. ఆంజనేయుడి బిట్స్‌ని చూపించి, సముద్రాన్ని లంఖిస్తున్న మారుతిగా సన్నీడియోల్‌ని వెనకనుంచి చూపించడం ఆడియన్స్‌కి గూస్‌బంప్స్ తెప్పించాయి. హనుమాన్‌చాలీసా వస్తుండగా టైటిల్స్ దిగుతుంటే.. ఆంజనేయుడి ఆగమానం గుర్తొచ్చి జనం భావోద్వేగానికి లోనయ్యారు. చివరిగా ఇంటిల్లిపాదీ కలిసి చూడాల్సిన సినిమా 'రామాయణం'.

క్రీడోదయం

హార్దిక్ ముంబయిలో ఒంటరిగా ఫీలయ్యాడన్న రాయుడు

- కెప్టెన్సీ వదిలి ఆటపై దృష్టి పెట్టాలని సూచన
- ముంబయిలో కొనసాగితే ఆటగాడిగానే ఉండాలన్న అభిప్రాయం
- జట్టు మారినా ఒక సీజన్ కెప్టెన్సీ వద్దని వ్యాఖ్య
- పంజాబ్, చెన్నై జట్లు అతడికి మంచి ఎంపికలని వెల్లడి



ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చుట్టూ ఐపీఎల్ 2027కు ముందే చర్చ మొదలైంది. అతడు జట్టును వీడనున్నాడంటూ ట్రేడ్ వార్తలు వస్తున్న నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముంబయి జట్టులో హార్దిక్ తనను ఒంటరిని చేశారన్న భావనకు గురై ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. అతడు మళ్లీ ముంబయి తరఫున ఆడాలనుకుంటే కెప్టెన్సీ బాధ్యతలు వదులుకుని ఆటపై దృష్టి పెట్టాలని సూచించాడు. క్రిక్‌బజ్ చర్చలో పాల్గొన్న రాయుడు.. ముంబయిలో హార్దిక్ పరిస్థితి అంత బాలేదని వ్యాఖ్యానించాడు. జట్టులో తనను ఓ మూలకు నెట్టేసినట్టు ఓ ఆటగాడు భావిస్తే, ప్రతి విషయంలోనూ వెనక్కి చూసుకోవాల్సి వస్తుందని చెప్పాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పరిస్థితులు ఆటగాడి ప్రవర్తనపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ విషయంలో జరిగిన ప్రతిదానికీ అతడినే తప్పుబట్టలేమని, ఇతర కారణాలు కూడా ఉండొచ్చని పేర్కొన్నాడు. 2024 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబయి ఇండియన్స్‌కు తిరిగొచ్చిన హార్దిక్‌కు ఫ్రాంచైజీ కెప్టెన్సీ అప్పగించింది. అప్పటివరకు జట్టుకు నాయకత్వం వహించిన రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు బాధ్యతలు ఇవ్వడంపై అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలోనూ జట్టుకు ఆశించిన ఫలితాలు దక్కలేదు. హార్దిక్ నాయకత్వంలో మూడు సీజన్లలో ముంబయి ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరినట్లు రాయుడు ప్రస్తావించాడు.హార్దిక్ ముంబయిలోనే కొనసాగాలనుకుంటే కెప్టెన్‌గా కాకుండా ఆటగాడిగా ఆడాలని రాయుడు సూచించాడు. తన సహజమైన ఆటను ఆస్వాదిస్తూ జట్టుకు మ్యాచ్ విన్నర్‌గా మారడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు. ఒకవేళ ముంబయిని వీడితే కనీసం ఒక సీజన్ పాటు మరో జట్టులోనూ కెప్టెన్సీ చేపట్టకూడదని అభిప్రాయపడ్డాడు. ట్రేడ్ ద్వారా హార్దిక్ వెళ్లే అవకాశాలపైనా రాయుడు స్పందించాడు. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో అతడికి మంచి వాతావరణం ఉండొచ్చని పేర్కొన్నాడు. అక్కడ కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా తన ఆటపై దృష్టి పెట్టవచ్చని చెప్పాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం ప్రస్తుతం కెప్టెన్ అవసరంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొంటున్నందున హార్దిక్‌కు అంత సులభమైన ఎంపిక కాదని విశ్లేషించాడు. హార్దిక్ పాండ్యా ముంబయి నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారే అవకాశాలపై వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అర్ష్‌దీప్ సింగ్‌తో ఆటగాళ్ల మార్పిడి ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ ట్రేడ్‌పై ఆయా ఫ్రాంచైజీల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

Edited, Published and Owned by Lakshmi Narayana.B and printed at Hyderabad TELANGANA State ,RNI NO: TGTEL/26/A8453 D.NO: 443-A/19-111, ROAD NO: 86, JUBILEE HILLS, FILM NAGAR, HYDERABAD , HYDERABAD District , TELANGANA State - 500096. Dohil Publications. Email.telugudailyudayam@.gmail.com, dohilpublications@gmail.com, Web:www.metroudayam.com, Cell: +919160003999/ 4999/ 5999.